సమావేశము - VIII
వాల్యూము - V
నెం. 5

వెల : రూ. 12-00
02 నవంబర్, 2017
గురువారం,
(శక సం. 1939,
కార్తీకం - 11)

# తెలంగాణ శాసన సభ కార్యకలాపాలు

## అధికార నివేదిక

విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | నక్షత్రపు గుర్తుగల ప్రశ్నలు - వాగ్రూప సమాధానములు | ... | 1 |
| 2. | సభా కార్యక్రమము :<br>వాయిదా తీర్మానం అనుమతి గురించి | ... | 14 |

# తెలంగాణ శాసనసభ
## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| సభాపతి | : | శ్రీ ఎస్. మధుసూదనాచారి |
| ఉప సభాపతి | : | శ్రీమతి ఎం. పద్మా దేవేందర్ రెడ్డి |
| అధ్యక్షుల పేర్ల పట్టిక | : | శ్రీ బాజిరెడ్డి గోవర్ధన్ |
| | | శ్రీ పి. బాబు మోహన్ |
| | | శ్రీమతి కొండ సురేఖ |
| | | డా. (శ్రీమతి) జె. గీత |
| కార్యదర్శి | : | డా.వి. నరసింహాచార్యులు |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ ఎస్. దుర్గా ప్రసాద్ |
| | | శ్రీ సిహెచ్. ఉపేందర్ రెడ్డి |
| | | శ్రీమతి వి. ఎస్. ప్రసన్న కుమారి |
| | | శ్రీ బి. కమలాకర్ |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీ పి. శ్రీనివాస్ |

# తెలంగాణ శాసన సభ చర్చలు

## అధికార నివేదిక

## (ఎనిమిదవ సమావేశము – రెండవ రోజు)

## గురువారం, నవంబర్ 02, 2017

(సభ ఉ. గం. 10.00 లకు ప్రారంభమైనది)

(గౌరవ సభాపతి అధ్యక్ష స్థానంలో ఉన్నారు)

### నక్షత్రపు గుర్తుగల ప్రశ్నలు – వాగ్రూప సమాధానములు

**మిస్టర్ స్పీకర్:–** ప్రశ్న సంఖ్య.2756.

### మిడ్‌మానేరు జలాశయం ప్రాజెక్టు

ప్రశ్న నెం. 41(2756)

శ్రీ రసమయి బాలకిషన్ (మానకొండూరు), శ్రీమతి బోడిగ శోభ (చొప్పదండి), శ్రీ రమేష్ చెన్నమనేని (వేములవాడ):– గౌరవనీయులైన సాగు నీటి శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) మిడ్‌మానేరు రిజర్వాయరు ప్రాజెక్టు పూర్తి చేయడానికి తీసుకున్న చర్యలేమిటి; పనుల ప్రస్తుత స్థితి ఏమిటి ;

ఆ) సదరు ప్రాజెక్టు ద్వారా సాధించే ఉద్దేశిత ప్రయోజనాలు ఏమిటి;

ఇ) మిడ్ మానేరు రిజర్వాయరు ప్రాజెక్టు పనులు ఎప్పటిలోగా పూర్తవుతాయి?

**సాగు నీటి శాఖ మంత్రి (శ్రీ టి. హరీష్ రావు):–** అ) 1. మిగిలిన కట్టడాలకు చెల్లింపులు, ముంపుకు గురైన గ్రామాల ప్రభావిత పి.డి.ఎఫ్.లకు ఆర్ & ఆర్ చర్యల నిమిత్తం తగినంత నిధులను బడ్జెట్‌లో కేటాయించడమయింది.

2. పనులను అత్యంత ప్రాధాన్యతపై నిర్వహించడమవుతున్నది.

3. మిగిలిన అన్ని ఆర్ & ఆర్ ఇన్‌ఫ్రా పనులను చేపట్టడమయింది. అవి పూర్తయ్యే దశలో ఉన్నాయి.

ఆ) ఎంఎంఆర్ పూర్తయిన తరువాత, మానకొండూరు, కరీంనగర్, చొప్పదండి, హుస్నాబాద్, సిద్ధిపేట, జనగాం, స్టేషన్ ఘన్‌పూర్, సిరిసిల్ల నియోజకవర్గాల పరిధిలో మిడ్ మానేరు కాలువల ద్వారా 2.00 లక్షల ఎకరాల ఆయకట్టును సాగు చేయడమవుతుంది. పైన తెలిపిన దానికి అదనంగా ఇది కాళేశ్వరం ప్రాజెక్టు, ఎంఎంఆర్ ప్రధాన బ్యాలెన్సింగ్ రిజర్వాయరుగా వుండడమే కాకుండా సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి శాసనసభ నియోజకవర్గాలలో 18 మండలాలలో గల 446 జనావాసాలకు వర్తింపు అయ్యే మిషన్ భగీరథ పథకం కోసం వనరుగా కూడా వుంటుంది.

ఇ) ప్రధాన పనులను 2017, డిసెంబరు నాటికి, ఇతర వివిధ అనుబంధ పనులను 2018, మార్చి నాటికి పూర్తి చేయాలని కార్యక్రమాన్ని రూపొందించడమయింది.

**శ్రీ రసమయి బాలకిషన్:–** అధ్యక్షా, శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో మిడ్‌మానేరు గురించి అడిగే అవకాశం వచ్చినందుకు నా మనస్సు ఉప్పొంగుతోంది. "తలాపునా పారుతోంది గోదారి, మా సేను, మా సెలక ఎడారి, గోదావరి, గోదావరి పాడేటి గోదావరి, చుట్టూ నీళ్లు ఉన్నా చుక్కా దొరకని ఎడారి ఈ భూమి " అని గత పన్నాలుగు సంవత్సరాలుగా గోదావరి నీళ్ల గురించి కన్నీళ్ల మీద కైగట్టుకున్న సందర్భాలు గుర్తుకు వస్తున్నాయి. ఈ రోజు ఆ దశ నుంచి ఒక ముఖ్యమైన విషయాన్ని ప్రశ్నించే అవకాశం రావడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నాను. నాటి ఉద్యమ నేత, నేటి ముఖ్యమంత్రి కేసీఆర్ గారు తెలంగాణ ఉద్యమం మొత్తం జల సాధన ఉద్యమంలా కొనసాగించినందున ఆ సందర్భాన్ని గుర్తుకు చేసుకోవాల్సిన అవసరం ఉన్నది.

**మిస్టర్ స్పీకర్:–** సూటిగా అంశం గురించి మాట్లాడండి.

**శ్రీ రసమయి బాలకిషన్:–** అధ్యక్షా, అక్కడ మొదలు పెడితేనే ఇక్కడ కొనసాగుతుంది. వరద కాలువ పొడుపు చాలా ఉంటుంది కదా. 1994వ సంవత్సరంలో అప్పటి ప్రధాన మంత్రి మన తెలంగాణ బిడ్డ పి. వి. నరసింహారావు గారు ఫ్లడ్ ఫ్లో కెనాల్‌కు అనుమతిచ్చిన విషయాన్ని గుర్తు చేసుకోవాలి. ఆ అనుమతిచ్చిన తరువాత కూడా 10 సంవత్సరాల పాటు టిడిపి, మరో 10 సంవత్సరాలు కాంగ్రెస్ ప్రభుత్వాలు సుదీర్ఘ కాలం పరిపాలించినప్పటికీ, నీళ్లిచ్చే విషయాన్ని

దేవుడెరుగు, ఒక వరద కాలువకు భూ సేకరణ కూడా చేయకుండా అడ్డుపడి కుట్రతో, కుతంత్రాలు చేసి టిడిపి వాళ్ల నిర్మాణాన్ని ఆపు చేసిన సందర్భాన్ని గుర్తు చేసుకోవాలి.

**మిస్టర్ స్పీకర్:–** బాలకిషన్‌గారూ, సూటిగా అంశం గురించి మాట్లాడండి.

**శ్రీ రసమయి బాలకిషన్:–** అధ్యక్షా, కాంగ్రెస్ వాళ్లు పని మొదలు పెట్టినట్లుగా అక్కడక్కడ మొదలుపెట్టి, ఎక్కడ వీలుంటే అక్కడ కాసుల కోసం కక్కుర్తిపడి కాంట్రాక్టర్లు కాలువలు తొవ్విన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను. చేయాలనే సంకల్పం ఉన్నందున తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తరువాత ఏవిధంగా పనులు జరిగాయనే విషయాన్ని మీకు మనవి చేస్తాను. 20 సంవత్సరాలుగా జరగని పనిని మూడు సంవత్సరాల్లో పూర్తి చేసి మిడ్ మానేరు నిండా నీళ్లు తీసుకువచ్చిన మంత్రి హరీష్‌రావు గారికి మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేస్తున్నాను. మిడ్‌మానేరు పరీవాహక ప్రాంతం మొత్తం మా మానుకొండూరు నియోజకవర్గంలో ఉంటుంది. దీనిలో మా భూములు పోయాయి. మానేరులో నీళ్లు నింపిన మంత్రి హరీష్ రావు గారికి, ముఖ్యమంత్రి గారికి ఈ సందర్భంగా ధన్యవాదములు. మిడ్‌మానేరులో కొన్ని దశల్లో పనులు ఇంకా పూర్తి కాలేదు. కావున, ఆ పనులు ఎప్పటివరకు పూర్తౌతాయనే విషయాన్ని తెలియజేయాలని మంత్రి గారిని కోరుతున్నాను. క్రిందకు వచ్చే కాలువలకు ఉన్న భూ సేకరణ సమస్యలను ఎప్పటివరకు పూర్తి చేస్తారనే విషయాన్ని తెలియజేయాలని కోరుతున్నాను. ఈ రోజు మిడ్‌మానేరు తెలంగాణ మొత్తానికి నీళ్లందించే గుండె లాంటింది. గుండె మనిషికి రక్తాన్ని పంప్ చేసిన విధంగానే మిడ్‌మానేరు గోదారి నీళ్లను తెలంగాణకు పారిస్తుంది.

**శ్రీమతి బి.శోభ:–** అధ్యక్షా, చొప్పదండి నియోజకవర్గం బోయిన్‌పల్లి మండలం, మానువాడ గ్రామంలో నిర్మిస్తున్న మిడ్ మానేరు ప్రాజెక్టును ఎప్పటి వరకు కంప్లీట్ చేస్తారు. దాంట్లో ఎన్ని టిఎమ్‌సిల నీళ్లని స్టోరేజ్ చేస్తాము. వ్యవసాయానికి ఎన్ని నీళ్లు అందిస్తారు. మిషన్ భగీరథ డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టు ద్వారా ఎన్ని గ్రామాలకు, ఎప్పటిలోపు నీళ్లందిస్తారు. ఉమ్మడి రాష్ట్రంలో బోయిన్‌పల్లి మండలం, మానువాడ గ్రామంలో ప్రజలందరూ తమ వ్యవసాయ భూములను ఈ ప్రాజెక్టుకు ఇవ్వడం జరిగింది. అక్కడ ప్రమాదం జరిగినప్పుడు వచ్చిన ముఖ్యమంత్రి గారు, మంత్రి హరీష్ రావు గారు మానువాడ ఇండ్లు మునగక పోయినప్పటికీ పెద్ద మనసు చేసుకొని, గ్రామస్థులందరూ ఇదే విలేజ్‌లో ఉండాలనీ ఒక్కో కుటుంబానికి 8 లక్షల రూపాయాల చొప్పున ఇస్తామని మాకు మాట ఇవ్వడం జరిగింది. కావున, మానువాడ కుటుంబాలకు ఎప్పటివరకు ఆ డబ్బులను ఇవ్వగల్గుతాం. ఎప్పటి వరకు ప్రాజెక్టును పూర్తి చేసి ఎన్ని టిఎమ్‌సిల నీళ్లను స్టోరేజ్‌చేసుకుంటామనే విషయాన్ని చెప్పాలని మంత్రి గారిని కోరుతున్నాను.

**శ్రీ సిహెచ్. రమేష్ :–** అధ్యక్షా, మిడ్‌మానేరు ప్రాజెక్టు 2006వ సంవత్సరంలో ప్రారంభమై ఇప్పుడు పూర్తౌతోంది. ఎప్పుడైనా వరద వస్తే నీళ్లొస్తాయని అనుకున్న ఈ ప్రాజెక్టును గౌరవ మంత్రి గారు, ముఖ్యమంత్రి గారు రీడిజైనింగ్ రూపంలో తెలంగాణాకు గుండె లాగా రూపొందించారు. గోదావరిలో వాటా తీసుకొని ఈ ప్రాజెక్టును ఇంత పెద్దగా చేయడం అభినందనీయం. గత 17 నుంచి 18 సంవత్సరాల పాటు ఈ ప్రాజెక్టును నిర్మిస్తూ ముంపు బాధితులకు పునరావాసం చేయడానికి చాలా కష్టపడాల్సి వచ్చింది. ముంపు గ్రామాలు చొప్పదండి, సిరిసిల్లలో ఉన్నాయి. కానీ, పునరావాసం మొత్తం వేములవాడలో ఉంది. 9 గ్రామాలకి సంబంధించి దాదాపుగా 35 వేల మంది జనాభా వేములవాడలో పునరావాసం పొందుతున్నారు. కోటి ఎకరాలకు నీళ్లు తెచ్చుకునే సమయంలో ఈ రకమైన పునరావాసం సరిగ్గా ఉండదు. పునరావాసం వారికి నిజంగా ఉపాధి కల్పించే విధంగా ఉండాలి. ముంపు గ్రామాల వాళ్లు భూములు కోల్పోయారు. ముంపు బాధితులకు భూములు ఇవ్వడం కోసం నారేపల్లి, సంకపల్లి, వేముల వాడ గ్రామస్థులు కూడా భూములు కోల్పోయారు.

10.10 ఉ. ఇటువంటి ప్రణాళిక అనేది భవిష్యత్తులో అవసరం కాబట్టి, ఈ కార్యక్రమాలను ఏ విధంగా చేయబోతున్నారని మంత్రి గారిని ప్రశ్నిస్తున్నాను. అంతే కాకుండా ముంపు పునరావాసానికి ఖర్చు తగ్గించే విధంగా కూడా చేయవచ్చు. 10 నుండి 12 సంవత్సరాలు ప్రాజెక్టులు చేసిన తరువాత, ప్రాజెక్టుకు ఎంత ఖర్చు అయ్యిందో, అంతకన్నా ఎక్కువ ఖర్చు పునరావాసానికి అయ్యింది. దానిని నేను తప్పు పట్టడం లేదు. పునరావాసం కోసం 1362 మందికి ఒక్కొక్కరికి రెండు లక్షల చొప్పున, 26 కోట్ల రూపాయల అదనపు ప్యాకేజీని గౌరవ ముఖ్యమంత్రి గారు ఇవ్వడం జరిగింది. భవిష్యత్తులో ఒకపద్ధతి ప్రకారం ఈ కార్యక్రమాలను చేసినట్లైతే తక్కువ ఖర్చుతో ఎక్కువగా వాళ్లకు ఉపాధి ఇచ్చి పునరావాసం కల్పించే విధంగా కొత్త విధానాన్ని ఏర్పాటు చేస్తే ఈ సమస్యలు తీరుతాయి. గౌరవ మంత్రివర్యుల ముందు, రాష్ట్రప్రభుత్వం ముందు భవిష్యత్తులో ఇంకా పెద్ద కార్యక్రమాలు ఉన్నాయి. కాబట్టి, ఈ కార్యక్రమాలను చేపట్టాలని తెలియజేస్తున్నాను. నా నియోజకవర్గంలోని వేములవాడలో ఎత్తిపోతల పథకానికి మంత్రిగారు శంఖుస్థాపన చేశారు. ప్యాకేజి 9 ద్వారా నిమ్మపల్లి ప్రాజెక్టు సశ్యశ్యామలం అవుతుంది. సిరిసిల్ల, వేములవాడ వంటి మెట్ట ప్రాంతాల్లో ఉన్న 2 లక్షల ఎకరాలకు వచ్చే సంవత్సరం లోపల నీళ్లు ఇచ్చే విధంగా మిడ్ మానేరు ప్రాజెక్టు పూర్తి అయ్యింది. అందుకు గాను తెలంగాణ రాష్ట్రానికి, ముఖ్యమంత్రి గారికి హృదయపూర్వకమైన ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

**శ్రీ టి. జీవన్ రెడ్డి (జగిత్యాల):–** అధ్యక్షా, ప్రాణహిత, చేవెళ్ల, కాళేశ్వరం ప్రాజెక్టుల అంతర్భాగం మిడ్‌మానేరు ప్రాజెక్టు. ఎల్లంపల్లి నుండి మిడ్‌మానేరుకు ప్యాకేజి 6,7,8 ఎత్తిపోతల పథకం ద్వారా నీళ్లు తరలించాలి. ఎస్.ఆర్.ఎస్.పి. సర్‌ప్లస్ అయినప్పుడు వరద నీటి కాలువ ద్వారా మిడ్ మానేరుకు నీళ్లు వచ్చే అవకాశం ఉంది. ఇది జాప్యం కావడంతో మిడ్ మానేరు ద్వారా త్రాగు నీరు అందించడం వలన కానీయండి లేక క్యూరింగ్ అనే ఆలోచనతో 12 టి.ఎమ్.సి.ల నీటిని ఎస్.ఆర్.ఎస్.పి. నుండి మిడ్ మానేరుకు తరలించడం జరిగింది. ఎస్.ఆర్.ఎస్.పి.లో 12 టి.ఎమ్.సి.ల నీరు కొరత కావడంతో ఆయకట్టు పూర్తిగా సాగు కావడం లేదు. ఈ ఆయకట్టు పూర్తిగా సాగు కావాలంటే దాదాపు 70 టి.ఎమ్.సి.ల నీళ్లు రావాలి. 70 టి.ఎమ్.సి.ల నీళ్లలో 12 టి.ఎమ్.సి.ల నీళ్లు కొరత కావడంతో మొదటి పంటకు నోచుకోలేకపోయాము. కనీసం రెండవ పంట వస్తుందని ఆశిస్తున్న తరుణంలో కాళేశ్వరం అంతర్భాగ మైనటువంటి మిడ్ మానేరుకు ఎస్.ఆర్.ఎస్.పి. ద్వారా సర్‌ప్లస్ అయినటువంటి పరిస్థితిలో మాత్రమే వరద నీటి కాలువ ద్వారా కిందికి రావాల్సి ఉంటుంది. దానిని క్యూరింగ్ అనండి, త్రాగు నీరు అనండి, ఏ విధంగా అన్నప్పటికీ, 12 టి.ఎమ్.సి.ల కొరత ఏర్పడుతుంది. ఈ 12 టి.ఎమ్.సి.ల నీళ్ల కొరతను మీరు ఏ విధంగా భర్తీ చేయబోతున్నారు. 12 టి.ఎమ్.సి.ల నీటి కొరత వల్ల రబి పంటను కోల్పోయే పరిస్థితి ఉంది. కాబట్టి, ఈ విషయమై మంత్రి గారు దృష్టి కేంద్రీకరించాలి. వరద నీటి కాలువను 2007–08 సంవత్సరంలో పూర్తి చేసుకుని, మిడ్ మానేరు పూర్తి కాకపోయినా ఎల్.ఎమ్.డి.కి నీళ్లు తరలించడం జరిగింది. జాప్యం అయిన మాట వాస్తవం. అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీ హయాంలో 2004–2008 సంవత్సరాల మధ్య కాలంలో ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించి వరద నీటి కాలువను పూర్తి చేయడం జరిగింది. ఎస్.ఆర్.ఎస్.పి. నుండి మిడ్ మానేరుకు తరలించిన 12 టి.ఎమ్.సి.ల నీటిని ఏ విధంగా భర్తీ చేయబోతున్నారో, రబి పంటను ఏ విధంగా ఆదుకోబోతున్నారో మంత్రి గారు సవివరంగా తెలియజేయాలని కోరుతున్నాను.

**శ్రీ టి. హరీష్ రావు:–** అధ్యక్షా, గౌరవ సభ్యులు రసమయి బాలకిషన్ గారు, బోడిగ శోభ గారు, చెన్నమనేని రమేష్‌గారు, జీవన్ రెడ్డి గారు వివిధ ప్రశ్నలు మిడ్ మానేరుకు సంబంధించి నీటి లభ్యత, నీటి విడుదల గురించి మాట్లాడడం జరిగింది. గౌరవ జీవన్ రెడ్డి గారు జాప్యం గురించి మాట్లాడారు. ఆ క్రమంలో ప్రభుత్వం చేసిన ఒకమంచి పనిని, 1993 సంవత్సరంలో ప్రారంభమైన మిడ్ మానేరు ప్రాజెక్టు 2017 సంవత్సరంలో పూర్తి అయ్యింది. అంటే 25 సంవత్సరాలలో కాని ఈ పనిని ప్రభుత్వం ఇప్పుడు చేస్తే, అభినందిస్తారేమో అని అనుకున్నాను. కానీ, పెద్దలు జీవన్ రెడ్డి గారు ఈ విషయమై ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం అనేది వారి విజ్ఞత.

రసమయి బాలకిషన్ గారు చెప్పినట్టు ఈ మిడ్ మానేరు ప్రాజెక్టు 1993వ సంవత్సరంలో పి.వి. నర్సింహారావు గారు ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు, వరద కాలువలో భాగంగా మిడ్ మానేరును మంజూరు చేయడం జరిగింది. 1993 నుండి 2006 వరకు దాదాపు 13 సంవత్సరాల పాటు మిడ్ మానేరు ప్రాజెక్టు రిపోర్ట్ రెడీ అయినా టెండర్లు పిలిచే పరిస్థితి లేదు. 13 సంవత్సరాల తరువాత 2006 సంవత్సరంలో జలయజ్ఞంలో భాగంగా మిడ్ మానేరుకు టెండరు పిలిచారు. 2006 సంవత్సరం నుండి 2014 సంవత్సరం వరకు అంటే 8 సంవత్సరాల 5నెలలు కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రాష్ట్రంలో అధికారంలో ఉంది. ఈ కాలంలో మిడ్ మానేరు ప్రాజెక్టు మీద అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన ఖర్చు రూ.106కోట్లు. అంటే కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురయ్యాయని చెప్పడానికి ఇంత కన్నా ఉదాహరణ ఏమి కావాలని నేను అడుగుతున్నాను. 1993 సంవత్సరంలో శాంక్షన్ అయితే 13 సంవత్సరాల పాటు ఒక్క అంగుళం కూడా ముందుకు కదిలే పరిస్థితి లేదు. 2006 సంవత్సరంలో టెండర్లు పిలిచి, 2014 వరకు అధికారంలో ఉండి కేవలం రూ.106 కోట్ల పని మాత్రమే చేశారు. ఈ ప్రభుత్వం వచ్చిన 3 సంవత్సరాల్లో రూ.401కోట్ల పనులు పూర్తి చేసి 10 టి.ఎమ్.సి.ల నీళ్లు రిజర్వాయర్లలో నిలిపే విధంగా సిద్ధం చేసి పెట్టుకున్నాము. 5 టి.ఎమ్.సి.ల నీళ్లు ఈ సంవత్సరం నిలపడం జరిగింది. పనుల వివరాలు చూస్తే, 8 సంవత్సరాల 5 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 46 క్యూబిక్ మీటర్ల మట్టి పని చేశారు. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత 77లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి పని చేసింది.

(కాంగ్రెస్ సభ్యుల నుండి అంతరాయం)

మట్టి పని కొంచెం అల్కాగా ఉంటుంది కాబట్టి, ఆ మాత్రం చేశారు. 4,80,000 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పని చేయాల్సి ఉంటే 8 సంవత్సరాల 5 నెలల్లో 50వేల క్యూబిక్ మీటర్లు. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత 4,10,000 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనిని పూర్తి చేశాము. గేట్ల విషయానికి వస్తే ఒక్క అంగుళం కూడా ముందుకు పోలేదు. ఇప్పుడు 3,200 మెట్రిక్ టన్నుల గేట్లు కూడా సిద్ధమయ్యాయి, వచ్చే 2, 3 మాసాల్లోనే గేట్లు బిగించి మిడ్ మానేరు ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామని తమరి ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

ప్రాజెక్టు ఆలస్యం కావడం వలన, ప్రాజెక్టు ప్రణాళికలో, ప్లానింగ్‌లో లోపం ఉండడం వలన ప్రాజెక్టు కాస్ట్ కూడా పెరిగింది.

ఈ ప్రాజెక్టుకు ఎంత ఖర్చు అయ్యిందని గౌరవ సభ్యులు రసమయి బాలకిషన్ గారు, ఆర్ అండ్ ఆర్ మరియు భూసేకరణకు ఎంత ఖర్చు అయ్యిందని రమేష్‌గారు అడిగారు. ప్రణాళికా లోపం ఉంటే ఏ విధంగా ఉంటుందని అనడానికి మిడ్ మానేరు ఒక ఉదాహరణ. రూ.639 కోట్లు పనుల నిమిత్తం ఖర్చు అయితే, ఎల్.ఏ. ఆర్ అండ్ ఆర్ మీద అయిన ఖర్చు రూ.1771 కోట్లు. అంటే మూడింతలు ఎల్.ఏ. ఆర్ అండ్ ఆర్ మీద ఖర్చు బాగా పెరిగిన విషయాన్ని గౌరవ సభ్యులు గమనించాలి. ఈ ప్రాజెక్టు పూర్తి చేయడానికి కేవలం డబ్బు కేటాయించడమే కాకుండా గౌరవ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు గారు తెలంగాణకు గుండెకాయ లాంటి ప్రాజెక్టు అని, కరవు ప్రాంతాలైన హుస్నాబాదు, కాళేశ్వరంలకు కీలకమైనది కాబట్టి, దీనిని ప్రతి రోజూ ఒక కాన్‌స్టెంట్ పర్యుయేషన్ ద్వారా స్థానిక ఎం.ఎల్.ఏ.లు, ఎం.పి.లు, మా మంత్రి వర్యులు కే.టి.ఆర్. గారు ఎప్పటికప్పుడు రెవ్యూ చేసి ఆర్ అండ్ ఆర్, భూసేకరణ, కాంట్రాక్చ్యువల్ ఇష్యూలను ఎప్పటికప్పుడు పర్స్యూ చేయడం వలన ఈ ప్రాజెక్టును ఈ ప్రభుత్వం ఇంత వేగంగా పూర్తి చేయగలిగిందని తెలియజేస్తున్నాను. షాబాస్‌పల్లి వద్ద ఒక బ్రిడ్జ్ ఉంటుంది. అప్పటి ప్రాజెక్టుల గురించి వాళ్లు ఆలోచించలేదు, అసలు మిడ్‌మానేరు అయితే మునిగిపోతుంది. ఐదున్నర టి.ఎం.సి.ల నీళ్లు నిలిపితేనే షాబాస్‌పల్లి బ్రిడ్జ్ మునిగిపోయింది. ఆ విషయాన్ని కూడా దృష్టిలో పెట్టుకుని 2005వ సంవత్సరంలోనే రూ.178కోట్లతో డబుల్ లేన్ బ్రిడ్జ్‌ను మంజూరు చేశాము. ఈరోజు దానిని పూర్తి చేసి రవాణాను కూడా దాని మీద పునరుద్ధరించగలిగాము. ముందు చూపుతో చిత్తశుద్ధితో ప్రభుత్వం పని చేసింది కనుకనే బ్రిడ్జ్ పూర్తి చేశాము. మిడ్ మానేరు ప్రాజెక్టులో ఐదున్నర టి.ఎం.సి.ల నీళ్లు నిలపగలిగాము.

**10.20 ఉ.** మీరు మిడ్ మానేరుకు నీళ్లు తీసుకుపోయారు కనుక ఎస్.ఆర్.ఎస్.పి. ఆయకట్టుకి నీళ్లు తక్కువ పడతాయని గౌరవనీయులు జీవన్ రెడ్డి గారు ఒక మాట అన్నారు. వారు కరీంనగర్‌లో మంత్రిగా పని చేశారు, చాలా సీనియర్ సభ్యులు, 466 గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా మిడ్‌మానేరు నుండి త్రాగు నీరు అందిస్తున్నామని నేను చెప్పిన సమాధానంలోనే ఉంది. అంటే జీవన్ రెడ్డి గారు చొప్పదండి, వేములవాడ, సిరిసిల్లకు మంచినీళ్లు అవసరం లేదని మీరు చెప్పదలచుకున్నారా? ఎస్.ఆర్.ఎస్.పి. నుండి మిడ్ మానేరుకు 5.3 TMC నీళ్లు తీసుకువెళ్లాము. వారు బయట ప్రెస్ మీట్‌లలో కూడా పదే పదే ఈ విషయాన్ని చెప్తున్నారు. శాసనసభను కూడా పక్క దోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రభుత్వం చేసే ప్రయత్నం ఏమిటో అందరికీ తెలుసు. Drinking water precedes priority over every thing. సాగు నీటి, పారిశ్రామిక నీటి అవసరాల కంటే త్రాగు నీటి అవసరాలకు ప్రపంచంలోనైనా, దేశంలోనైనా, రాష్ట్రంలోనైనా ప్రథమ ప్రాధాన్యత ఉంటుంది. 466 గ్రామాలకు త్రాగు నీరు ఇచ్చే మిషన్ భగీరథ ప్రాజెక్టుకు మిడ్‌మానేరు ప్రాజెక్టు వేదిక, పనులన్నీ పూర్తి అయ్యాయి, డిసెంబర్ నుండి 466 గ్రామాలకు త్రాగు నీరు ఇవ్వబోతున్నాము. ఆ త్రాగునీటి అవసరాలు తీర్చడం కోసం ఎస్.ఆర్.ఎస్.పి. నుండి మిడ్ మానేరుకు నీళ్లు తీసుకువస్తే, మాకు నీళ్లు తక్కువ పడ్డాయి, నీళ్లు ఏ విధంగా తీసుకుపోతారు, వేములవాడ, సిరిసిల్ల, చొప్పదండి వాళ్లకు మంచినీళ్లు కూడా ఇవ్వొద్దు అన్నట్టుగా జీవన్‌రెడ్డి గారు మాట్లాడడం చాలా బాధాకరమైన విషయం. వారి వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని కోరుతున్నాను.

అదృష్టవశాత్తు ఈరోజు సింగూరులో 29.5 టి.ఎం.సి.ల నీళ్లు ఉన్నాయి. నిజాం సాగర్‌లో నీళ్లు వచ్చాయి, సింగూరులో కూడా నీళ్లు ఉన్నాయి కనుక, సింగూరు నుండి నిజాం సాగర్ ద్వారా ఎస్.ఆర్.ఎస్.పి.ని సప్లిమెంట్ చేసి ఎస్.ఆర్.ఎస్.పి. ఆయకట్టుకు ఈ రబిలో పూర్తి స్థాయికి నీళ్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని మీ ద్వారా తెలియజేస్తున్నాను. మాకు చిత్తశుద్ధి ఉంది, తప్పకుండా నీళ్లు ఇస్తాము. వేరే విషయాలు చెప్పాలంటే చాలా ఉన్నాయి, కాని, ఎస్.ఆర్.ఎస్.పి.కి కూడా గత సంవత్సరం పూర్తి స్థాయిలో నీళ్లు ఇచ్చాము. మా నియోజక వర్గానికి ఎన్ని నీళ్లు వస్తాయని రసమయి బాలకిషన్ గారు అడిగారు. ఈ మిడ్‌మానేరు ద్వారా 48,731 ఎకరాలకు మానకొండూరు నియోజక వర్గానికి నీళ్లు అందిస్తాము. కాలువ పనులు దాదాపు పూర్తి అవుతున్నాయి, చిన్న చిన్న భూసేకరణ ఇబ్బందులు ఉన్నాయి, ఎం.ఎల్.ఏ.గారు కూడా రైతులతో మాట్లాడి త్వరితగతిన అందిస్తే వచ్చే సంవత్సరం లింక్ అవుతుంది కనుక, 2018 జూన్‌లో మీ నియోజక వర్గానికి పూర్తి స్థాయిలో నీళ్లు ఇవ్వగలుగుతాము. చిన్న చిన్న భూసేకరణ విషయంలో మీ సహకారం కూడా ఉండాలని కోరుతున్నాను. చొప్పదండి నియోజకవర్గంలో బోయినపల్లి మండలానికి సంబంధించిన 5వేల ఎకరాలకు ఈ ప్రాజెక్టు ద్వారా నీళ్లు అందిస్తామని శోభ గారికి కూడా తెలియజేస్తున్నాను. రమేష్‌గారు అన్నట్టు ఈ మిడ్ మానేరు నుండి ముఖ్యంగా వేములవాడకు లిఫ్ట్ పెట్టాము. ఆ టెండర్ పనులు కూడా పూర్తి చేస్తున్నాము. ఎందుకంటే వేములవాడకు వేలాది మంది భక్తులు వస్తూ, ఆ గుడి చెరువులో పుణ్య స్నానాల్ని ఆచరిస్తూ ఉంటారు. ఇంతకు ముందు అక్కడ నీటి ప్రవాహం లేక అదే మురికి నీటిలో పుణ్య స్నానాలు చేశారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని మిడ్ మానేరు నిండా నీళ్లు ఉన్నాయి కనుక చిన్న లిఫ్ట్‌తో ఎప్పటికప్పుడు గుడి చెరువును నింపడం ద్వారా భక్తుల పుణ్యస్నానాలు, పంట పొలాల సాగుకు నీళ్లు అందించే విధంగా లిఫ్ట్ ఇరిగేషన్‌ను మంజూరు చేశాము. దాని పనులు వచ్చే ఐదారు మాసాల్లో పూర్తి చేసి వేములవాడ పుణ్య

క్షేత్రానికి వచ్చే భక్తులకు గోదావరి నీళ్లు అందిస్తామని మీ ద్వారా రమేష్ గారికి తెలియజేస్తున్నాను.

## సంతానోత్పత్తి కేంద్రాలలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు

ప్రశ్న నెం.42( 2728)

సర్వశ్రీ మంచిరెడ్డి కిషన్‌రెడ్డి (ఇబ్రహీంపట్నం), కె.పి.వివేకానంద (కుత్బుల్లాపూర్), తీగల కృష్ణారెడ్డి (మహేశ్వరం):– గౌరవనీయులైన వైద్య మరియు ఆరోగ్య శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) రాష్ట్రంలో తనిఖీ చేయకుండా పెద్ద సంఖ్యలో సంతాన సాఫల్యత కేంద్రాలు ముఖ్యంగా హైదరాబాదు నగరంలో నిర్వహించబడుతున్న విషయం వాస్తవమేనా;

ఆ) ఈ సంతాన సాఫల్యత కేంద్రాలు అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతూ, సరోగసీ పద్ధతిని ప్రోత్సహిస్తున్న విషయం వాస్తవమేనా; అపరిచిత వ్యక్తుల శిశువుకి జన్మనిచ్చిన స్త్రీ భయానక పరిస్థితులలో జీవిస్తున్న విషయం కూడా వాస్తమేనా;

ఇ) అయితే, ఈ విషయంలో తీసుకుంటున్న చర్యలేమిటి?

**వైద్య మరియు ఆరోగ్య శాఖ మంత్రి (శ్రీ సి.లక్ష్మా రెడ్డి):**– అ) లేదండీ. అయితే, పిసి అండ్ పిఎన్‌డిటి చట్టం క్రింద రాష్ట్రంలో 71 సంతాన సాఫల్యత కేంద్రాలు నమోదయ్యాయి. జిల్లా సమర్థ అధికారి చేత ఈ కేంద్రాలన్నింటినీ క్రమం తప్పకుండా తనిఖీ చేయబడ్డాయి. హైదరాబాదులో 27 సంతాన సాఫల్యత కేంద్రాలు నమోదయ్యాయి.

ఆ) 1994, పి.సి. అండ్ పిఎన్‌డిటి చట్టం క్రింద మరియు 1996 నియమావళి క్రింద ఎఆర్‌టి క్లినికల్ లైసెన్సు పొందకుండా మరియు ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు డబ్బు ఆశ చూపి వాణిజ్య పద్ధతిలో బంజారా హిల్స్‌లోని మెసర్స్ సాయి కిరణ్ ఆసుపత్రి సరోగసీ విధానాన్ని నిర్వహిస్తుందని సికింద్రాబాదు, పాట్నీ సర్కిల్ సమీపంలో, టాస్క్ ఫోర్స్ కార్యాలయంలోని సెంట్రల్ జోన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ 17–6–2017 తేదీన తెలియజేశారు.

ఇ) విచారణ జరిపిన తరువాత, వివిధ రాష్ట్రాల నుండి 48 సరోగేట్ తల్లులను acute మాదిరిగా ఉన్న ఆసుపత్రి ఆవరణలో ఉంచినట్లు కనుగొనడమయింది. పిసి అండ్ పిఎన్‌డిటి చట్టం క్రింద పైన తెలిపిన ఆసుపత్రిపై చర్యలు తీసుకోవడమయింది. నాంపల్లిలోని మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి గౌరవనీయ ఎ.సి.ఎరెన్ సమక్షంలో వాణిజ్య పద్ధతిలో సరోగసీ నిర్వహించినందుకు గాను మెసర్స్ సాయి కిరణ్ ఆసుపత్రి, బంజారా హిల్స్ వారిపై క్రిమినల్ కేసును దాఖలు చేయడమయింది. ఆ కేసు విచారణలో వుంది.

గౌరవ హైకోర్టులో పైన తెలిపిన ఆసుపత్రిపై "పిల్‌ను" దాఖలు చేయడమయింది. అది కోర్టు విచారణలో ఉన్నది.

ప్రభుత్వ స్పెషలిస్టులైన నిపుణుల వైద్య బృందం చేత సరోగేట్ తల్లులకు క్రమం తప్పకుండా వైద్య చెకప్‌లు నిర్వహించడమవుతున్నాయి.

సంతాన సాఫల్యత కేంద్రాలను తనిఖీ చేయాలని జిల్లాలలో తమ అధికార పరిధి క్రింద ఉన్న సమర్థ అధికారులందరినీ ఆదేశించడమయినది.

ప్రస్తుతం సరోగసీ ఏదేనీ కేంద్ర చట్టం లేదా దాని క్రింద గల నియమావళి క్రింద వర్తింపు కావడం లేదు. సరోగసీ పై నియమావళిని రూపొందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. సరోగసీకి మహిళలు గురి కాకుండా ఈ నియమావళి నియంత్రిస్తుంది. ప్రభుత్వం త్వరలో ఈ నియమావళిని జారీ చేస్తుందని ఆశించడమయింది.

**డా. జి. చిన్నారెడ్డి (వనపర్తి):**– అధ్యక్షా, తల్లి కావడం అనేది భగవంతుడు ఆడవాళ్లకు ఇచ్చిన గొప్ప వరం. కొన్ని కారణాల చేత కొంత మంది తల్లి కాలేకపోతారు. అటువంటి సందర్భంలో ఆర్టిఫీషియల్ రిప్రొడక్షన్ టెక్నిక్ అనే సాధనంతో భార్య యొక్క అండాన్ని తీసుకుని, భర్త యొక్క వీర్యంతో ప్రయోగశాలలో ఫలదీకరణ చేసిన తరువాత, ఆ ఫలదీకరణ చెందిన అండాన్ని, సరోగసీ ద్వారా ఇంట్రడ్యూస్ చేస్తే, ఆ అద్దె గర్భంలో ఈ పాప పెరిగి జన్మనిచ్చిన తరువాత, ఎవరైతే అండము, వీర్యము ఇస్తారో ఆ పేరెంట్స్‌కి అప్పచెప్పడం జరుగుతుంది. కానీ, ఇది చాలా పెద్ద ఎత్తున, ఒక కమర్షియల్ పద్ధతిలో మన రాష్ట్రంలో జరుగుతోంది. 71 సంతాన సాఫల్యతా కేంద్రాలు నమోదు అయ్యాయని గౌరవ మంత్రివర్యులు సమాధానంలో చెప్పారు. కానీ, ఇటువంటి వందలాది సెంటర్లు ప్రభుత్వ అనుమతి లేకుండా నడుస్తున్నాయి. అందులో గౌరవ మంత్రి గారు చెప్పిన, బంజారాహిల్స్‌లో ఉన్న సాయికిరణ్ ఆసుపత్రిలో 5 సంవత్సరాల్లో 400 మంది పిల్లలకు సరోగసి క్రింద జన్మనిచ్చిన తల్లులు ఉన్నారు. వీరందరూ మన రాష్ట్రం వారు కాదు. ఉత్తర తూర్పు రాష్ట్రాల నుండి వచ్చిన చాలా బీదరికంలో ఉన్నటువంటి వాళ్లు చాలా మంది ఇక్కడ ఉన్నారు. మమ్మల్ని పిల్లల్ని పుట్టించే యంత్రాలుగా వాడుకుంటున్నారని కొంత మంది ఇబ్బంది పడుతున్నారు. మధ్యవర్తులు 30లక్షలు తీసుకుని ఈ మాదిరిగా అద్దె గర్భం దాల్చిన వారికి ఒక్కొక్కరికి 2½ నుండి 3 లక్షల రూపాయలు మాత్రమే చెల్లించడం జరుగుతోంది. ఇది రాకెట్‌స్పీడ్‌లో జరుగుతుంది. దీనిని నియంత్రణ చేయాల్సిన అవసరం ఉంది. ఈ విషయాలను పూర్తిగా పరిశీలన చేయడానికి ఒక కమిటి వేశామని మంత్రి గారు చెప్పారు.

ఆ కమిటీ ఎప్పుడు వేయడం జరిగింది, ఆ వివరాలేమిటి, కమిటీలో సభ్యులు ఎవరు ఉన్నారు, ఆ కమిటీని ఎంత సమయం లోపు నివేదిక ఇవ్వమని ఆదేశించారు. కేంద్రం ఎలాంటి చట్టం తీసుకు రాలేదని చెప్పారు. మన రాష్ట్రంలో ఒక చట్టం తీసుకు వస్తే, ఈ చట్టం కేంద్రానికి కూడా మార్గదర్శకంగా ఉండే విధంగా చేయాలని, ఈ రాకెట్‌స్పీడ్‌ను తప్పకుండా అరికట్టాలని తమరి ద్వారా గౌరవ మంత్రివర్యులను కోరుతున్నాను.

10.30 ఉ. **శ్రీమతి ఎన్.పద్మావతి రెడ్డి (కోదాడ):-** అధ్యక్షా, మంత్రిగారు ఇచ్చిన సమాధానంలో సాయికిరణ్ ఆసుపత్రి పై క్రిమినల్ కేసు బుక్ చేశారని ఉన్నది. ఏ విధంగా అయితే ఒక గర్భవతిని చూసుకోవాలో అలా లేకుండా పశువుల్లాగా ఒకటే గదిలో దాదాపు 50 మంది మహిళలను పెట్టారని ప్రెస్ రిపోర్టుల ద్వారా తెలిసింది. అక్కడున్న మహిళలకు రెగ్యులర్‌గా చెకప్స్ అవుతున్నాయని మంత్రిగారు సమాధానంలో చెప్పారు. కానీ వారిని రీలొకేట్ ఎక్కడ చేశారు. ఈ మహిళలు ఇతర ప్రదేశాల నుంచి వస్తారు. వారు Very economically backward ladies. వాళ్లకు రీహాబిలిటేషన్ ఎక్కడ చేశారనేది సమాధానంలో కనపడలేదు. చిన్నారెడ్డిగారు చెప్పినట్లు This is a big boon for any woman that she helps other persons who are unable to become parents on their own by giving her womb on rent to give birth to a child for them to lead their life. ఆ మహిళలు సరోగసి ద్వారా పేరెంట్స్ కానీ పేరెంట్స్‌ను, పేరెంట్స్ చేయాలని అనుకుంటున్నారు. ఇది చాలా మంచి విషయం. దీనికి సంబంధించి మీరు చాలా క్లియర్‌గా సమాధానం ఇవ్వండి. దీనికి సంబంధించిన డిస్ట్రిక్ట్ అప్రాప్రియేట్ అథారిటీ ఎవరో తెలియజేయాల్సిందిగా కోరుతున్నాను. ఎవరెవరు వచ్చి ఇలాంటి సెంటర్లను తనిఖీ చేస్తున్నారు, Not only in Hyderabad మొత్తం రాష్ట్రంలో ఇలాంటి సెంటర్లు ఎన్ని ఉన్నాయో చెప్పాల్సిందిగా మంత్రిగారిని కోరుతున్నాను.

**డా.జె.గీత (హుజూరాబాద్):-** అధ్యక్షా, ఈ అంశం చాలా ముఖ్యమైనది. ఎంతో మంది కపుల్స్‌కు సంబంధించిన ప్రశ్నకు సమాధానం రావడం జరిగింది. మంత్రిగారు సాయికిరణ్ సెంటర్ గురించి మాట్లాడారు. మరొక సెంటర్ పద్మజ ఫర్టిలిటి సెంటర్ భువనగిరిలో ఉన్నది. అందులో కూడా 50 మంది సరోగేట్ తల్లులు ఉన్నారు. మంత్రిగారు ఈ విషయం గురించి ప్రస్తావించలేదు. ఆ సెంటర్‌పై కూడా కేసు నమోదు చేయాల్సిన అవసరం ఉన్నది. కేసు వేస్తామంటే వాళ్లు, మా దగ్గర అన్ని లీగల్ డాక్యుమెంట్లు ఉన్నాయని చెబుతున్నారు. There is a big vacuum in the legal framework. ఎందుకంటే, మీరు ఇందాక ఇచ్చిన జవాబులో You are cutting across PC & PNDT Act క్రింద పోతున్నారని చెప్పారు. But, a lot of violations are taking place under this Act. ఆ రూల్స్ అన్ని ఇందులో ఫిట్ కావు. But, I would like to suggest that why do not you take it up as a Government? దీనికి ఎటువంటి యాక్ట్ లేదు. ఇంత వరకు ఒక యాక్ట్‌ను పార్లమెంట్‌లో సబ్మిట్ చేయడం జరిగింది కానీ, దాని మీద చర్చ జరగలేదు. ఈ ప్రభుత్వం చాలా ధైర్యం చేసి ఎస్.సి. సబ్‌ప్లాన్‌ను తెచ్చింది. పంచాయతీ రాజ్ యాక్ట్‌ను మళ్లీ తీసుకొని రావాలనుకోవడం, Panchayathi Raj Act is a Central Act. But, you do not have special act in the State. ఆ విధంగా మీరు ఒక యాక్ట్‌ను తీసుకొని రండి. You should be pioneer of this act. You have the required strength and you can get the Bill passed. It can become act. I would like to suggest as a doctor that this is necessary as my colleague, Smt. Padmavathi Reddy as said. గతంలో ఐ.వి.ఎఫ్ అనేది ఉండేది. ఇప్పుడు కూడా ఉన్నది. This is a technique which has been going on for a long time. ప్రపంచమంతా ఈ విధానం నడుస్తున్నది. నా దగ్గర దీనికి సంబంధించిన ఎన్‌సైక్లోపీడియా ఉన్నది. ఇది మీకు కావాలంటే పంపిస్తాను. Please return it to me. All the countries in the worldలో ఎలాంటి చర్యలు దీని గురించి తీసుకుంటున్నారు. Some are saying that it is illegal. Some countries are saying that it is partly legal. ఎందుకంటే కమర్షియల్ యాక్టివిటీ లేకుండా న్యాయంగా ఉంటే This kind of things they are accepting. It is a two billion commercial activity in our Country. సుమారు 50శాతం జనాభా బయట దేశాల నుంచి మన దేశానికి వస్తున్నారు. ఎందుకంటే It is cheaper. దీన్ని కూడా ఒక కమర్షియల్ యాక్టివిటీగా తీసుకుంటున్నారు. This is coming in the medical tourism only. మన మహిళలు చౌకగా దొరుకుతున్నారని ఇలా చేస్తున్నారు. All this is very vague. The question is will the Minister take up seriously? This Government should be pioneer in this field for the rest of the Country and bring any act for surrogacy.

**SRI T. RAM MOHAN REDDY (Parigi):-** Mr. Speaker, Sir, surrogacy is governed by PC & PNDT Act. ఆ బిల్ ప్రకారం ప్రతి రాష్ట్రంలో మానిటరింగ్ అప్రాప్రియేట్ అథారిటీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. మన రాష్ట్రంలో ఇప్పటి వరకు అప్రాప్రియేట్ అథారిటీని కేంద్ర ప్రభుత్వం పొందుపరచిన బిల్లు ప్రకారం చేయాల్సిన బాధ్యత రాష్ట్రం

ప్రభుత్వంపైన ఉన్నది. కానీ, ఇప్పటి వరకు మన రాష్ట్ర ప్రభుత్వం ఈ బిల్లును చేయనందు వల్ల, అద్దె గర్భానికి సంబంధించిన ఇన్‌ఫర్టిలిటి సెంటర్లను విచ్చల విడిగా ఏర్పాటు చేయడం వల్ల పేద ప్రజానీకానికి, వాళ్ల ఆరోగ్యానికి చాలా పెద్ద ఎత్తున నష్టం జరుగుతోంది. ఈ బిల్లులో పొందుపరచిన అంశాల ప్రకారం కనీసం 5 సంవత్సరాలు At least the intended couple must be Indian citizens and married for at least five years. The clause is that one of them should be infertile. The surrogate mother has to be a close relative who has been married and had a child of her own. ఈ నిబంధనలు తప్పకుండా పాటించాలి. No payment other than reasonable medical expenses can be made to the surrogate mother. The surrogate child will be deemed to be a biological child of the intending couple. The Central and the State Governments will appoint appropriate authorities to grant eligibility certificate to intending couple and the surrogate mother. The authorities will also regulate surrogate clinics by taking surrogacy fees and advertising that exploiting the surrogate mother will be punishable with imprisonment for ten years and fine up to Rs. 10 lakhs. ఇలాంటి నియమ నిబంధనలు ఖచ్చితంగా అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపైన ఉన్నది. వెంటనే అప్రాప్రియేట్ అథారిటీని ఏర్పాటు చేయాలని మంత్రిగారిని కోరుతున్నాను.

**డా.సి.లక్ష్మారెడ్డి:–** అధ్యక్షా, గౌరవసభ్యులు చిన్నారెడ్డిగారు, గీతారెడ్డిగారు, పద్మావతిగారు ఈ సరోగసీపైన చాలా చక్కని సలహాలు, సూచనలు ఇవ్వడం జరిగింది. ప్రభుత్వం తప్పకుండా వారి సూచనలను స్వీకరిస్తుంది. ఆ సెంటర్లపై చర్య తీసుకోవాలని ఒక కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. రామ్మోహన్‌రెడ్డిగారు రాష్ట్రప్రభుత్వానిదే మొత్తం బాధ్యత అన్నట్లు మాట్లాడడం జరిగింది. మిగతా సభ్యులు చాలా చక్కగా సూచనలు ఇవ్వడం జరిగింది. చాలా సంతోషం. గత రాష్ట్ర ప్రభుత్వాలు ఏమి చేయకనే ఈ పరిస్థితి నెలకొన్నది. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇటువంటి వాటిలో చాలా శ్రద్ధ తీసుకొని ముఖ్యమంత్రిగారు రాష్ట్రంలో గతంలో ఉన్న ఇబ్బందులను తొలగించి ఒక మంచి సమాజం ఏర్పడే దిశగా ప్రజలకు ఒక మంచి పరిస్థితిని కల్పించే విధంగా ఎన్నో రిఫామ్స్‌లను తీసుకొని రావడం జరుగుతోంది. దానిలో భాగంగా ఆరోగ్య శాఖ ఇప్పటికే చాలా రీఫామ్స్ తీసుకొని రావడం జరిగింది. సరోగసి విషయంలో గౌరవ సభ్యులు అన్నట్లుగా ఇప్పటికే ఒక కమిటీని వేయడం జరిగింది. కమిటీ సభ్యులు Justice Gopal Reddy, Retired judge ఆధ్వర్యంలో కమిటీ వేయడం జరిగింది. అందులో సభ్యులుగా Commissioner, Health, Medical and Family Welfare, Telangana State, Dr.Pushpa Bhargav, Ex-Director, Centre for Cellular and Molecular Biology, Hyderabad, Dr.Rama Krishna Reddy, Chairman, Ethical Committee, Telangana State Medical Council, Dr.Balamba, Retired Gynecologist, Dr. Anuradha, Infertility Specialist, Dr.Malathi, Professor, Gynecology, Petla Burju Hospital, Director, Public Health, Telangana State.

**10.40 ఉ.** రిటైర్డ్ జస్టిస్ గోపాల్‌రెడ్డి గారి ఆధ్వర్యంలో నిపుణుల కమిటీని వేయడం జరిగింది. కేంద్రప్రభుత్వం 2016లో సరోగసికి సంబంధించి లోక్‌సభలో బిల్ ప్రవేశపెట్టారు. అది యాక్ట్ కాలేదు. కాబట్టి సభ్యులు ఏవైతే సూచనలు చేయడం జరిగిందో వాటిని ఫాలో చేస్తాము. పెద్దలు గీతా రెడ్డి గారు చెప్పినట్లు భారతదేశంలో మొట్టమొదటిసారిగా మన రాష్ట్రంలో ఈ యొక్క యాక్ట్‌ను తీసుకురావడం జరిగింది. మన రాష్ట్రంలో మొత్తం 76 సెంటర్లున్నాయి. హైదరాబాదులో 27, రంగారెడ్డిలో 15, మేడ్చల్‌లో 17, వరంగల్‌లో 4, కరీంనగర్‌లో 4, మహబూబ్‌నగర్‌లో 2, నిజామాబాద్‌లో 2, అదిలాబాద్‌లో 1, మంచిర్యాలలో 1 ఉన్నాయి అధ్యక్షా. ఇవన్నీ గతంలో మన ప్రభుత్వం రాక ముందు శాంక్షన్ చేశారు. వీటిపై ఎప్పటికప్పుడు మన డిపార్ట్‌మెంట్ ద్వారా మానిటరింగ్ చేయిస్తున్నాము. ఫర్దర్‌గా ఎటువంటి ఇల్లీగల్ యాక్టివిటీస్ జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటాము. గతానికి, ఇప్పటికీ పోలిస్తే చాలా మార్పులు వచ్చాయి. ఈ విషయానికి సంబంధించి మనం తొందరలోనే యాక్ట్ తీసుకురావడానికి ప్రయత్నం చేస్తామని మనవి చేస్తున్నాము.

## పాడి పరిశ్రమకు ప్రోత్సాహం

ప్రశ్న నెం. 43( 2798)

శ్రీమతి గొంగిడి సునీత (ఆలేరు), సర్వశ్రీ అంజయ్య యెల్గనమోని (షాద్‌నగర్), బానోత్ మదన్‌లాల్ (వైరా), శ్రీనివాస్‌గౌడ్, వి. (మహబూబ్ నగర్):– గౌరవనీయులైన పశు సంవర్థక, పాడి పరిశ్రమాభివృద్ధి శాఖా మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) రాష్ట్రంలో పాడి పరిశ్రమను పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని ప్రభుత్వం యోచిస్తున్న విషయం వాస్తవమేనా;

ఆ) అయితే , ఆ వివరాలేమిటి;

ఇ) విజయ డెయిరీతో సమానంగా ఇతర పాడి పరిశ్రమ రైతులకు లీటరు ఒక్కింటికి రూ. 4/- ల ప్రోత్సాహక మొత్తాన్ని ఇచ్చే ప్రతిపాదన ఏదైనా ఉన్నదా;

ఈ) రైతులకు ఖర్చుచేసిన మొత్తం పరిమాణం ఎంత; ఎంతమంది రైతులు లబ్ధి పొందుతారు;

ఉ) అయితే, ఆ వివరాలేమిటి ?

**పశు సంవర్థక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య పరిశ్రమల శాఖ మంత్రి (శ్రీ తలసాని శ్రీనివాస్ యాదవ్):–** అ) అవునండీ.

ఆ) లాలాపేటలో రోజుకి 4.5 లక్షల లీటర్ల సామర్థ్యం గల ప్రస్తుత పాత డెయిరి ప్లాంటు స్థానంలో, రూ. 170 కోట్ల అంచనా వ్యయంతో రోజుకి 8 లక్షల లీటర్ల సామర్థ్యంతో కొత్త డెయిరీ ప్లాంటును ఏర్పాటు చేయాలని ప్రతిపాదించడమయింది.

ఇ) అవునండీ. 24-9-2017 తేదీ నుండి టిఎస్‌డిడిసిఎఫ్‌తో సమానంగా నల్గొండ–రంగారెడ్డి మిల్క్ యూనియన్; కరీంనగర్ డెయిరీ కంపెనీ లిమిటెడ్ మరియు ముల్కనూరు, మిల్క్ యూనియన్లకు లీటరుకు రూ. 4/– ల చొప్పున నగదు ప్రోత్సాహక పథకాన్ని అమలుపరచడానికి 22–09–2017 తేదీగల ఎహెచ్‌డిడి & ఎఫ్ (డిఎ–II ) శాఖ జి.ఓ.ఎం.ఎస్.నెం.22 లో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఈ & ఉ ) సుమారుగా 2.17 లక్షల మంది డెయిరీ రైతులు లబ్ధి పొందుతారు. ఇందు కోసం రూ.87 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేయడమయింది.

**శ్రీమతి గొంగిడి సునీత:–** అధ్యక్షా, మంత్రి గారిని ఇంకొక రెండు, మూడు డౌట్స్ క్లారిఫై చేయవలసిందిగా కోరుతున్నాను. పాడి– పంట అని మనం మొదటి నుండీ వింటూనే ఉన్నాము. కొన్ని ప్రాంతాలలో విపరీతమైన కరవు వచ్చినప్పుడు దాన్ని అధిగమించడానికి, పంటలు పండించలేని పరిస్థితులలో పాడి గేదెలను నమ్ముకొని జీవనం కొనసాగిస్తున్న విషయం అందరికీ తెలుసు. రెండు సంవత్సరాల క్రితం ముఖ్యమంత్రి గారు, విజయ డెయిరీ నష్టాలలో ఉందని, విజయా డెయిరీకి పాలను సరఫరా చేస్తున్న ప్రతి రైతుకూ లీటర్‌కి నాలుగు రూపాయల చొప్పున ఇన్సెంటీవ్ ఇవ్వాలని ఆనాడు ప్రకటించారు. అందులో భాగంగా ముల్కనూరు సొసైటీ అదే విధంగా నల్గొండ, రంగారెడ్డి జిల్లాల సొసైటీల వారు తమ డైరీలకు కూడా నాలుగు రూపాయల ఇన్సెంటీవ్ ఇవ్వాలని సెప్టెంబర్ 17 వ తేదీన గౌరవ ముఖ్యమంత్రి గారిని కలవడం జరిగింది. ఆ రోజు ముఖ్యమంత్రి గారు, ఏ విధంగా విజయ డెయిరీకి ఇన్సెంటీవ్ ఇస్తున్నామో అదే విధంగా మీకు కూడా వారం రోజులలో ఇస్తామని చెప్పారు. 24 సెప్టెంబర్ నుండి పాడి రైతులందరికీ నాలుగు రూపాయల ఇన్సెంటీవ్ ఇచ్చే విధంగా జీఓను జారీ చేశారు. రెండు సంవత్సరాల క్రితం విజయ డెయిరీకి పాలను సరఫరా చేసే వారికి నాలుగు రూపాయల ఇన్సెంటీవ్ ఇచ్చారు కాబట్టి, నల్గొండ, రంగారెడ్డి ప్రాంతాలలో ఉన్న విజయ డెయిరీకి సంబంధించిన బల్క్ సెంటర్స్‌ను విజయ డెయిరీలో మర్జ్ చేసే ఆలోచన ఉందా? ఆ విధంగా చేసి పాడి రైతులకు ఉపయోగ పడే విధంగా నిర్ణయం తీసుకుంటారా? మహబూబ్‌నగర్, మెదక్, అదిలాబాద్, ఖమ్మం వరంగల్ జిల్లాలలో యూనియన్స్ లేవు కాబట్టి కొత్త యూనియన్స్ మంజూరు చేసే అవకాశం ఉందా? అదే విధంగా పాడి రైతులకు సంబంధించి ముఖ్యమంత్రి గారు 17వ తేది సెప్టెంబర్‌న ప్రకటన చేశారు. సబ్సిడీ మీద పాడి గేదెలను ఇస్తామని అన్నారు. ఎప్పటి నుండి ఈ సబ్సిడీని ఇవ్వబోతున్నారు. ఎంత పర్సెంటేజ్ సబ్సిడీ ఇస్తారు, అందులో ప్రత్యేకంగా ఎస్సీ, ఎస్టీలకు ఎక్కువగా సబ్సిడీ ఇచ్చే అవకాశం ఉందా?

**శ్రీ వై. అంజయ్య:–** అధ్యక్షా, ప్రభుత్వం పాడి పరిశ్రమదారులకు నాలుగు రూపాయల ఇన్సెంటీవ్ ఇవ్వడం జరుగుతోంది. ప్రభుత్వం పది రోజులకొకసారి బిల్లుతోపాటు, ఇన్సెంటీవ్ చెల్లించడం సంతోషం. సబ్సిడీ పైన గేదెలను ఇస్తామంటున్నారు, సంతోషించదగిన విషయం. అదే విధంగా గ్రామీణప్రాంతాలలోని పేదరైతులు డెబ్బై వేల నుండి లక్షరూపాయల వరకూ ఖర్చు పెట్టి గేదెలను కొంటున్నారు. వాటికి రోగాలు వచ్చి చనిపోతున్నాయి. కాబట్టి వాటికి ఇన్సూరెన్స్ చేసే కార్యక్రమం ఏమైనా చేపట్టారా? ప్రభుత్వం వెటర్నరీ డాక్టర్లను నియమిస్తోంది, సంచార వెహికిల్స్‌ను పెట్టింది. అదే విధంగా కావలసిన మందులను సప్లై చేయాలని మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను. ప్రైవేట్ డాక్టర్ల దగ్గరకు వెళ్తే రూ. 500 తీసుకుంటున్నారు. ఆ బాధ నుండి తప్పించమని కోరుతున్నాను. గౌరవ మంత్రి గారిని కోరేదేమిటంటే, మా షాద్‌నగర్‌లో విశాలమైన స్థలంలో మిల్క్ చిల్లింగ్ సెంటర్స్ ఉన్నాయి. అక్కడ కాంప్లెక్స్ నిర్మించి, అక్కడే పాల బాటిల్స్ తయారుచేస్తే బాగుంటుంది. వాటిని అంగన్‌వాడీ సెంటర్లలో విక్రయించడానికి అవకాశం ఉంది. ఆవులకు, గేదెలకు ఇన్సూరెన్స్ చేయించమని మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

**శ్రీ వి. శ్రీనివాస్ గౌడ్:–** అధ్యక్షా, పాడిరైతులకు నాలుగు రూపాయల ఇన్సెంటీవ్ ఇచ్చినందుకు గౌరవ ముఖ్యమంత్రి గారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. హైదరాబాదులో మనకు నలభై లక్షల లీటర్ల పాలు అవసరమని మంత్రి గారు చెప్పారు. ఇంకా 7-8 లక్షల కెపాసిటీకి పెంచుతున్నామని చెప్పారు. పదిహేను లక్షల లీటర్ల కెపాసిటీకి పెంచినట్లయితే బాగుంటుందని మనవిచేస్తున్నాను. ఖమ్మం, సిద్ధిపేట, మెదక్, మహబూబ్‌నగర్, నిజామాబాద్‌లలో మిల్క్ చిల్లింగ్ సెంటర్స్ ఉన్నాయి. మొత్తం కలిపితే కేవలం పది వేల లీటర్ల కెపాసిటీ మాత్రమే ఉంటుంది. ఇంకా ఎక్కువ కెపాసిటీకి పెంచి,

అక్కడే ప్యాకింగ్ యూనిట్లు, ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేస్తే బాగుంటుంది. ప్రైవేట్ డెయిరీల వాళ్లు రెండు, మూడు రోజులపాటు పాలు నిలవ ఉండడానికి కెమికల్స్ కలుపుతున్నారు. వాటి పై నిఘా పెట్టారా? కేసులు పెట్టారా? గుజరాత్, కర్నాటక, మహారాష్ట్రల నుండి మనకు పాలు రావడం జరిగింది. కల్తీని నిరోధించడానికి ఈ డిపార్ట్‌మెంట్‌కి సరైన సిబ్బంది లేదు. ఫుడ్ ఇన్స్‌పెక్టర్‌ను అపాయింట్ చేస్తే బాగుంటుంది. మార్కెటింగ్ వ్యవస్థను పెంచాలి. పాలల్లో కెమికల్స్ కలపడం వల్ల క్యాన్సర్లు వస్తున్నాయి. అందువల్ల చర్యలు తీసుకోవాలి. ఈ డెయిరీలను పెంచడానికి ప్రయత్నం చెయ్యాలి. ఒకొక్క యువకుడికి అయిదు బర్రెలను ఇస్తే బాగుంటుంది. పాల వ్యాపారం అనేది యాదవ కులస్తుల వృత్తి. వారి నుండి ఆ వృత్తి చేజారిపోతుంది. కాబట్టి యాదవులకు ప్రిఫరెన్స్ ఇచ్చి ఈ డెయిరీలలో అవకాశం కల్పించండి. ఆ విధంగా చేస్తే యువకులకు నిరుద్యోగ సమస్య తీరిపోతుంది. స్వచ్ఛమైన పాలు వస్తాయి.

10.50 ఉ. **శ్రీ తలసాని శ్రీనివాస్ యాదవ్:-** అధ్యక్షా, గొంగిడి సునీత గారు, అంజయ్య గారు, శ్రీనివాస్ గౌడ్ గారు అనేక అంశాలపై చర్చించారు. విజయ డెయిరీకి సంబంధించి మనకు తెలుసు. గతంలో ఉన్నటువంటి ప్రభుత్వాలు అసలు విజయడైరీ అనేది లేకుండా ప్రైవేట్ వాళ్లను ప్రోత్సహించాలనే సంకల్పంతో దాన్ని నిర్లక్ష్యం చేశారు. ఇప్పుడిప్పుడే మనం ఒకదారికి వస్తున్నాము. ఈరోజు లాలాపేటలో డైరీ ఉంది. దాన్ని ఎనిమిది లక్షల లీటర్ల కెపాసిటీ వరకూ పెంచుకోవాలని, కొత్త టెక్నాలజీతో ముందుకు వెళ్తున్నాము. పాడిరైతులు లక్షల సంఖ్యలో ఉన్నారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తరువాత గౌరవ ముఖ్యమంత్రి గారు పాడి పరిశ్రమను పెంపొందించాలనే లక్ష్యంతో ఆ రోజు రైతులను పిలిచినప్పుడు, పాల ధరకు రెండు రూపాయల ఇన్సెంటివ్ ఇవ్వాలని వారు కోరితే, నాలుగు రూపాయల ఇన్సెంటివ్ ఇచ్చిన చరిత్ర ముఖ్యమంత్రి గారిదని మనవిచేస్తున్నాను. విజయ డైరీకి సంబంధించి ఇప్పటికే మనం అరవైరెండు వేల మంది రైతుల నుండి పాలను సేకరిస్తున్నాము. నల్గొండ మథర్ డెయిరీ, కరీంనగర్, ముల్కనూరు డెయిరీల రైతులు, మాకు కూడా నాలుగు రూపాయల ఇన్సెంటివ్ ఇవ్వండి అని అడిగారు. ముఖ్యమంత్రి గారు మమ్మల్ని పిలిచి, ఆ విధంగా ఇస్తే ఎంత భారం పడుతుందని అడిగారు. అప్పుడు మేము రూ. 25 కోట్ల రూపాయల భారం పడుతుందని చెబితే, పాడి రైతులను ఆర్థికంగా బలోపేతం చెయ్యాలని చెప్పి, నిర్ణయం తీసుకొని కేవలం వారం రోజుల్లోనే దాన్ని ఇంప్లిమెంట్ చేశారు. విజయ డెయిరీ రైతులు 65 వేల మంది, నల్గొండ జిల్లా రైతులు 9.11 మంది, కరీంనగర్ జిల్లా రైతులు 10.82 మంది ఉన్నారు. సునీత గారు విజయ డెయిరీని, మథర్ డెయిరీని ఒకే యూనిట్ కింద తెస్తే బాగుంటుందని చెప్పారు. తప్పకుండా ఆ విషయాన్ని పరిశీలిస్తాము. దానికున్న చట్టం వేరు, దీనికున్న చట్టం వేరు, అయినా వారు చెప్పిన అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటాము. ప్రగతి భవన్‌కి ఆ రోజు రైతులందరూ వచ్చినప్పుడు, మాకు గేదెలపై సబ్సిడీ ఇస్తే బాగుంటుందని ముఖ్యమంత్రి గారిని అడిగారు. ఆ రోజు ముఖ్యమంత్రి గారు, వారిని, ఒకగేదె ఖరీదు ఎంత ఉంటుందని అడిగితే, దాదాపు అరవై వేల రూపాయలుంటుందని ఆ రైతులు చెప్పారు. యాభై శాతం సబ్సిడీని రెండు లక్షల పదిహేడు వేల కుటుంబాలకు ఇవ్వాలని సి.ఎం. గారు ఆదేశించడం జరిగింది. అక్కడున్నటువంటి ఆయా సొసైటీలకు సంబంధించి లెక్కలు తెప్పించుకొని, డీపీఆర్‌లను తయారుచేయడం జరిగింది. వీలైనంత తొందరలో దీనిని ఇంప్లిమెంటేషన్‌లోకి తెస్తామని తెలియజేస్తున్నాను.

11.00 ఉ. ఎస్సీ, ఎస్టీలకు 75 శాతం సబ్సిడీ, మిగతావారికి 50 శాతం సబ్సిడీని ప్రకటించడం జరిగింది. 2.17 లక్షల మందికి 50 శాతం చొప్పున సబ్సిడీకై రూ.600 కోట్ల అవసరమవుతాయని ముఖ్యమంత్రి గారిని అడగ్గా మన రైతుల కోసమే కదా, ఏమీ కాదనీ, పెద్దమనసుతో, కమిట్‌మెంట్‌తో రూ.600 కోట్లు ఇస్తామని ముఖ్యమంత్రి గారు తెలియజేయడం జరిగింది. అంజన్న గారు అడిగిన ఇన్సురెన్స్ విషయంలో పాలిచ్చే బర్రెలకు బీమా పథకం ఉంది. దీనికి నాలుగు కోట్ల రూపాయలను కేటాయిస్తున్నాము. సంవత్సరానికి 1.77 ప్రీమియం చొప్పున మూడు సంవత్సరాలకు గాను 5.25 శాతం ప్రీమియంను మనం చెల్లిస్తున్నాము. షాద్ నగర్‌కు నేను వెళ్లి డెయిరీని ప్రారంభించడం జరిగింది. అక్కడ ఉన్న అంగన్‌వాడీలకు ఇది ఉపయోగపడుతుందని చెప్పడం జరిగింది. దానిని తప్పకుండా పరిశీలన చేయడం జరుగుతుంది.

మిత్రుడు శ్రీనివాస్ గౌడ్ గారు మాట్లాడుతూ, హైదరాబాదుకు ఇతర రాష్ట్రాల నుంచి పాలు వస్తున్నాయని చెప్పడం వాస్తవం. హైదరాబాదుకు డిమాండ్ అధికంగా ఉన్నది. డిమాండ్‌కు అనుగుణంగా అందించాలనే 8 లక్షల లీటర్ల సామర్థ్యంతో మెగా డెయిరీని తీసుకువస్తున్నాము. ఫర్‌దర్‌గా చేయడం కోసం షామీర్‌పేట్‌లో 100 ఎకరాల భూమిని తీసుకుంటున్నాము. డెయిరీని విస్తరించడమే కాకుండా రాష్ట్రంలో విజయ డెయిరీ కాకుండా మిగతావి ఉండడానికి వీలు లేని పద్ధతిలో మనం ప్రమోషన్‌కు పోతున్నాము. విజయ డెయిరీకి మంచి డిమాండ్, మంచి క్వాలిటీ ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా టెంపుల్స్, టూరిజం ప్రాంతాల్లో, హైవేస్, సిటీలోని అన్ని ప్రాంతాల్లో ఔట్‌లెట్స్ పెట్టబోతున్నాము. ఇప్పటికే ఆ ప్రమోషన్స్‌లో మనం ముందుకు పోతున్నామని తెలియజేస్తున్నాను. తెలంగాణ 2014వ సంవత్సరంలో వచ్చినప్పటికీ, విజయా డెయిరీ

బైఫర్‌కేట్ అవడానికి రెండు సంవత్సరాలు పట్టింది. గతంలో లాగా డెయిరీ లేదు. ప్రైవేట్ డెయిరీలకు ధీటుగా, డెవలప్ చేయడానికి శాయశక్తులా ప్రయత్నం చేస్తున్నాము. రాబోయే రోజుల్లో సన్న కారు, చిన్నకారు రైతాంగానికి, పాడి మీద ఆధారపడిన కుటుంబాలకు తప్పకుండా మేలు చేసే విధంగా మన ప్రభుత్వం అన్ని కార్యక్రమాలు తీసుకోవడమే కాకుండా.

**మిస్టర్ స్పీకర్:–** షార్ట్ డిస్కషన్‌లో ఈ అంశం గురించి పూర్తిగా వివరించండి.

**శ్రీ తలసాని శ్రీనివాస్ యాదవ్:–** ఫేజ్డ్ మ్యానర్‌లో చాలా పెద్ద ఎత్తున ప్రమోషన్‌ను చేపడుతున్నాము. గతంలో డైరీని మూతవేయాలనే కుట్ర చేసిన పరిస్థితులు ఉండేవి. కానీ, ఈ రోజు డెయిరీని బ్రహ్మాండంగా డెవలప్ చేయడమే కాకుండా, రైతులకు అన్నివిధాలా ఉపయోగపడే విధంగా కార్యక్రమాలు తీసుకుంటామని మీ ద్వారా సభ్యులకు మనవి చేస్తున్నాను.

MR.SPEAKER:- Question NO. 3054 (44) is postponed.

## మార్కెట్లలో ఇ–నామ్‌ల అమలు

ప్రశ్న నెం.45(3017)

సర్వ శ్రీ బిగాల గణేష్(నిజామాబాద్), ఆరూరి రమేష్(వర్ధన్న పేట), ఆల్ల వెంకటేశ్వర్ రెడ్డి (దేవరకద్ర):– గౌరవనీయులైన సాగు నీరు, మార్కెటింగ్ శాఖ మంత్రి దయచేసి ఈక్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) ఇ–నామ్ ను అమలు చేస్తున్న వ్యవసాయ మార్కెట్ల సంఖ్య ఎంత;

ఆ) సదరు విధానాన్ని రాష్ట్రంలోని ఇతర మార్కెట్లకు విస్తరించే ప్రతిపాదన ఏదైనా ఉందా; అయితే ఆ వివరాలేమిటి;

ఇ) దీని అమలులో ఇప్పటివరకు సాధించిన విజయాలు ఏమిటి?

**సాగు నీరు, మార్కెటింగ్ శాఖ మంత్రి (శ్రీ టి. హరీష్ రావు):–** అ) 44వ్యవసాయ మార్కెటు కమిటీలలో అమలు చేయడమవుతున్నది.

ఆ) అవునండీ. మరో 14 వ్యవసాయ మార్కెటు కమిటీలను గుర్తించడమయింది. కేంద్ర ప్రభుత్వం కూడా ఆమోదించింది. వ్యవసాయ మార్కెటు కమిటీల వివరాలు: 1.ఇచ్చోడ 2.ఏన్కూర్ 3. గడ్డి అన్నారం 4. బోయిన్‌పల్లి 5. గుడిమల్కాపూర్ 6. హుస్నాబాద్ 7. కొత్తగూడెం 8. మద్నూరు 9. మహబూబాబాద్ 10. నల్గొండ 11.నవాబ్‌పేట 12.పరిగి 13.పరకాల 14.వట్‌పల్లి.

ఇ) 1. రూ.7,263.00 కోట్ల టర్నోవర్‌తో 18,08,037 మెట్రిక్ టన్నుల పరిమాణంలో వ్యాపారం చేయడమయింది.

2. దేశంలోని అన్ని వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటు కమిటీలలో, నిజామాబాదు వ్యవసాయ మార్కెటు కమిటీకి దాని అమలులో మొదటి స్థానానికి గాను ప్రధానమంత్రి ఎక్సలెన్సీ అవార్డుని ఇవ్వడమయింది.

**శ్రీ బిగాల గణేష్ :–** అధ్యక్షా, ఇ–నామ్ ప్రవేశ పెట్టినందుకు తెలంగాణా రైతులకు అనుకున్న మేరకు లాభం జరుగుతోందా? ప్రవేశ పెట్టిన మార్కెట్లలో రైతులు దీనిని ఉపయోగించుకుంటున్నారా, ఇ–నామ్ జాతీయ స్థాయిలో సక్రమంగా అమలు జరుగుతోందా? అనే విషయాలను తెలియజేయాలని కోరుతున్నాను. ఇంతకు ముందు మంత్రి గారు తెలియజేసిన విధంగా అత్యుత్తమ సేవకులుగా పని చేసిన దానికి ఇచ్చే Prime Minister Award for Excellency in Public Administration అవార్డు నిజామాబాద్ పట్టణ వ్యవసాయ మార్కెట్‌కు వచ్చింది. అనాటి జిల్లా కలెక్టరు గారు ఢిల్లీకి వెళ్లి ప్రధాన మంత్రి చేతుల మీదుగా ఆ అవార్డును తీసుకోవడం గర్వకారణం, సంతోషకరం. నిజామాబాద్‌లో మంత్రి హరీష్‌రావు గారు స్వయంగా ఇనామ్ ప్రవేశపెట్టారు. ప్రధానమంత్రి గారు ఢిల్లీ నుంచి ఆల్ ఇండియా లెవల్‌లో ఇ–నామ్ ప్రవేశ పెట్టడాన్ని వీడియో ద్వారా చూడడం సంతోషకరం. మాకు అవార్డులు రావడం ఆనందకరం. నిజామాబాద్‌లో ఇనామ్‌ని బాగా వాడుతున్నారని మాకు సమాచారం ఉంది. తెలంగాణలో ఉన్న వ్యవసాయ మార్కెట్లలో నిజామాబాద్ మార్కెట్ అత్యుత్తమైనది. దేశవ్యాప్తంగా ఉన్నటువంటి వరి, పసుపు మార్కెట్లలో సాంగ్లీసతారా తరువాత నిజామాబాద్‌కే చాలా ప్రత్యేకమైన స్థానం ఉంది. దేశ వ్యాప్తంగా నిజామాబాద్ మార్కెట్‌కు ప్రత్యేక స్థానం ఉన్నందున ఇ–నామ్ నిజంగా అమలులో పనిచేస్తుందా అనే విషయాన్ని తెలియజేయాలని మంత్రి గారిని కోరుతున్నాను.

**శ్రీ ఆరూరి రమేష్:–** అధ్యక్షా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా రైతులకు సౌకర్యాలు కల్పించడంలో మార్కెటింగ్ శాఖ అనేక కార్యక్రమాలు తీసుకోవడంతోబాటుగా ఇప్పటికే 44 మార్కెట్లలో ఇనామ్‌ని ప్రవేశపెట్టామని, దానిని విస్తరించేందుకు కృషిచేస్తామని తెలియజేసినందుకు మంత్రి గారికి, ప్రభుత్వానికి ధన్యవాదములు. నేను ప్రాతినిధ్యం వహిస్తున్న వర్ధన్నపేట నియోజకవర్గంలో ఉన్న ఎనుమాముల మార్కెట్ ఆసియాలోనే పెద్దది. ఈ మార్కెట్‌లో ఇ–నామ్ ని ప్రవేశ పెట్టకపోవడానికి గల కారణాలు తెలియజేయాలని మంత్రి గారిని కోరుతున్నాను. వరంగల్ మార్కెట్‌లో ఇ–నామ్ వల్ల రైతాంగానికి నేటి వరకు జరిగిన లాభాలను సభ ద్వారా

తెలియజేయాలని మంత్రి గారిని కోరుతున్నాను. మార్కెట్‌లో తూకాల్లో తేడాలు, మోసాలు ఉంటే ఇప్పటివరకు ఏమైనా చర్యలు తీసుకున్నారా, లేదా ఏమేరకు చర్యలు తీసుకుంటారనే విషయాలను తెలియజేయాలని మంత్రి గారిని కోరుతున్నాను.

**శ్రీ తీగల కృష్ణారెడ్డి:–** అధ్యక్షా, కోరిన వెంటనే మహేశ్వరం నియోజకవర్గంలో కొత్త మార్కెట్ యార్డుని మంత్రి హరీష్‌రావు గారు ఇవ్వడమే కాకుండా గత సంవత్సరం నుంచి పాలకవర్గం కూడా ఏర్పాటు చేయడం జరిగింది. కావున, ఆ మార్కెట్‌కై కొంత ల్యాండ్ మరియు నిధులు ఇవ్వాలని మంత్రి గారిని కోరుతున్నాను.

11.10 ఉ. **శ్రీ టి. హరీష్ రావు:–** అధ్యక్షా, గౌరవ శాసన సభ్యులు గణేష్ బీగాల గారు మాట్లాడుతూ ఇనామ్ అమలు పూర్తి స్థాయిలో సాధ్యమయ్యిందా, ఏ మేరకు అయ్యిందని అడిగారు. నిజానికి పూర్తి స్థాయిలో ఇనామ్ అమలు చేయలేకపోతున్నాము. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి రాధా మోహన్ సింగ్ గారి దృష్టికి కూడా తీసుకెళ్లాము. ఇనామ్ సర్వర్ ఉండాల్సినంత స్పీడ్‌లో లేకపోవడం వలన, పెద్ద ఎత్తున రైతులు మార్కెట్‌కు వచ్చినప్పుడు వేగవంతమైన ప్రక్రియ చేయలేకపోతున్నాము. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకుపోతే, తొందరలోనే వర్షన్–2 తీసుకురాబోతున్నాము, అది వచ్చిన తరువాత ఈ సమస్య పరిష్కారమౌతుందని అన్నారు. అది రావడానికి నెల, రెండు నెలల సమయం పడుతుందని కేంద్ర ప్రభుత్వం నుండి వస్తున్న సమాచారం. ముందు దశలో సభ్యులు గణేష్ బీగాల గారు, అప్పటి నిజామాబాద్ జిల్లా కలెక్టర్ గారు చొరవ చూపడం వలన రైతుల మరియు ట్రేడర్ల సహకారంతో నిజామాబాదులో ఇనామ్ అమలు చేశాము. దేశంలోని ఇతర రాష్ట్రాల వారు కూడా నిజామాబాదు మార్కెట్‌కు వచ్చి మనం చేస్తున్న తీరును నేర్చుకుని ఇతర రాష్ట్రాల్లో కూడా అమలు చేయడం జరుగుతోంది. ఇనామ్ చేయగలిగినప్పుడు పారదర్శకత అనేది పెరిగి, తూకాల్లో ఎటువంటి మోసాలు జరగకుండా ఉండే అవకాశం ఉంటుంది. ఇతర మార్కెట్లల్లో ఏ ఏ ధర వస్తుందనే విషయం ఏరోజుకారోజు, ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం రైతులకు ఉంటుంది. ముఖ్యంగా రైతుల సమయం ఆదా అయ్యే అవకాశం ఉంది. రైతు యొక్క ఖాతాలో నేరుగా ఆన్‌లైన్‌లో డబ్బులు జమ చేసే అవకాశం ఉంటుంది. లక్ష్యాలు బాగా ఉన్నప్పటికీ దాని అమలులో ఇంకా కొన్ని సాధకబాధకాలు ఉన్నాయి. ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రభుత్వం తరఫున కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకుపోతూ ఉన్నాము. త్వరలోనే ఆ సమస్యలన్నీ పరిష్కరిస్తామని ఈ మధ్యనే రాధా మోహన్ సింగ్ గారు రాష్ట్ర ప్రభుత్వానికి వ్రాసిన ఒక లేఖలో తెలియజేశారు.

పత్తికి కూడా ఈ విధానాన్ని పాటిస్తున్నారా, వరంగల్‌లో ఎందుకు చేయడం లేదని సభ్యులు అడిగారు. పత్తి రైతులు ఎక్కువ మంది రావడం వలన సర్వర్ పని చేయకపోవడం వల్ల పత్తి విషయంలో పూర్తి స్థాయిలో దీనిని అమలు చేయలేకపోతున్నాము. సర్వర్ సమస్య పరిష్కారమైన వెంటనే పత్తిని కూడా ఇనామ్‌లో క్రయ విక్రయాలు జరిగే విధంగా ప్రయత్నం చేస్తాము.

కొత్తగా ఏర్పాటు చేసిన మహేశ్వరం మార్కెట్‌కు కొన్ని నిధులు కేటాయించాలని తీగల కృష్ణారెడ్డి గారు అడిగారు. మూడు, నాలుగు రోజుల్లోగా మిమ్మల్ని మా డైరెక్టర్ గారిని పిలిచి ఒక సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి మీ మార్కెట్‌లో రైతులకు అవసరమైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు చేస్తామని తెలియజేస్తున్నాను.

## పర్యాటక రంగానికి ప్రోత్సాహం

ప్రశ్న నెం. 46(2948)

సర్వశ్రీ దాస్యం వినయ్‌భాస్కర్ (వరంగల్–వెస్ట్), మర్రి జనార్థన్ రెడ్డి (నాగర్ కర్నూల్), రాథోడ్ బాపురావు (బోథ్):– గౌరవనీయులైన షెడ్యూలు తెగల అభివృద్ధి, టూరిజం & సాంస్కృతిక వ్యవహారాల శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) రాష్ట్రంలో పెద్ద ఎత్తున పర్యాటక రంగాన్ని ప్రోత్సహించి, అభివృద్ధి పరచాలని ప్రభుత్వం యోచిస్తున్న విషయం వాస్తవమేనా;

ఆ) అయితే, ఈ విషయంలో రూపొందిస్తున్న ప్రణాళికల వివరాలేమిటి;

ఇ) పర్యాటక రంగానికి సంబంధించి మన రాష్ట్రం అనేక జాతీయ అవార్డులను పొందిన విషయం కూడా వాస్తవమేనా ;

ఈ) అయితే, ఆ వివరాలను తెలియజేస్తారా?

**ఆర్థిక శాఖ మంత్రి (టూరిజం & సాంస్కృతిక వ్యవహారాల శాఖ మంత్రి తరఫున) (శ్రీ ఈటల రాజేందర్):–** అ) అవునండీ.

ఆ) స్వదేశీ మరియు విదేశీ పర్యాటకుల సంఖ్యను పెంచడానికి అనేక ప్రణాళికలను రూపొందించి, అమలుపరుస్తున్నది. అంతే కాకుండా అనేక ప్రదర్శనలను మరియు పండుగలను నిర్వహిస్తున్నది.

ఇ) అవునండీ.

2015–16 సంవత్సరానికి వివిధ కేటగిరీల క్రింద 27-9-2017 తేదీన కొత్త ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ పర్యాటక శాఖ ఎనిమిది (8) జాతీయ పర్యాటక అవార్డులను స్వీకరించింది.

ఈ) అవార్డుల వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

1) Best Standalone Convention Centre – Leonia, Hyderabad.

2) Best Medical tourism facility – Apollo Health City, Hyderabad.

3) Civic Management of a Tourist Destination in India – Greater Hyderabad Municipal Corporation, Hyderabad.

4) Best Heritage City – Warangal City.

5) Best Tourism Promotion Publicity Material – Department of Tourism Theme Book published in Mandarin Language for China International Travel Mart.

6) Swachhta Award – Greater Warangal Municipal Corporation.

7) Best Tourist Guide – Sri Kasinath Rao, Tourist Guide.

8) Best Maintained and Disabled Friendly Monument – Chowmahalla Palace, Hyderabad.

**శ్రీ దాస్యం వినయ్ భాస్కర్:–** తెలంగాణ ప్రాంతం జలపాతాలతోను, సరస్సులతోను, గుట్టలతోను, గుహలతోను, అనేక చారిత్రాత్మక కట్టడాలతోను, గొప్ప శిలా సౌందర్యాలతో ఉన్నటువంటి పర్యాటక ప్రాంతం. గొప్ప చరిత్ర కలిగిన ఈ ప్రాంతాన్ని సమైఖ్య రాష్ట్రంలో కనుమరుగు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత గౌరవ ముఖ్యమంత్రి గారు టూరిజంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, పెద్ద ఎత్తున నిధులు కేటాయించి, ప్రపంచంలో ఉన్న పర్యాటకులందరినీ ఈ ప్రాంతం వైపు ఆకర్షించే విధంగా "జానో తెలంగాణ, ఆవో తెలంగాణ" అనే ఒకమంచి నినాదంతో పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించిన విషయం అందరికీ తెలుసు. ఈ విధంగా చేయడం వలన గతంలో కన్నా ఎక్కువ మంది పర్యాటకులు వచ్చి సందర్శించిన సమాచారం ఉంది. ఈ విధంగా ఎంత మంది వస్తున్నారు, పర్యాటక శాఖను అభివృద్ధి చేయడం వలన, ఒక పర్యాటకుని మూలంగా ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని ఐదారుగురికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు వస్తున్నాయని సమాచారం ఉంది. నాగార్జున సాగర్‌లో ఉన్న బౌద్ధ ప్రచారానికి గౌరవ ముఖ్యమంత్రి గారు 275 ఎకరాల స్థలాన్ని కేటాయించి ప్రపంచంలో ఉన్న బౌద్ధులందరినీ ఆకర్షించే విధంగా బుద్ధవనంను ఏర్పాటు చేయడం జరిగింది. ప్రపంచంలో ఉన్న బౌద్ధ మతస్తులంతా అక్కడికి రావడం జరిగింది. నా నియోజక వర్గంలో అనేక చారిత్రక కట్టడాలు ఉన్నాయి. పద్మాక్షమ్మ గుట్ట, సిద్ధుల గుట్ట, అగలయ్య గుట్ట అనే మూడు గుట్టలు ఉన్నాయి. కమీషనర్, బూర వెంకటేశం గారు వచ్చి సందర్శించి, కొన్ని రాయితీలు ఇచ్చి ఆ ప్రదేశాలను అభివృద్ధి చేస్తామని చెప్పడం జరిగింది. ఏ తీరుగా నిధులు కేటాయించబోతున్నారు, ఈ చారిత్రాత్మక కట్టడాలను అభివృద్ధి చేసినట్లైతే, బుద్ధ వనం లాగా, జైన్ వనం కూడా అభివృద్ధి చెందుతుంది. జైనులు అక్కడ మోక్షధామం కోసం త్యాగాలు చేసిన చరిత్ర ఉంది. 2000 సంవత్సరాల చరిత్ర గల ఈ గుట్టలను ప్రపంచంలో ఉన్న జైనులందరూ ఆకర్షించే విధంగా తీర్చి దిద్దాలని కోరుతున్నాను. పూర్వపు వరంగల్‌లో అనేక సరస్సులు, కట్టడాలు, గుట్టలు, గుహలు ఉన్నాయి. జనగాంను జైన్‌గాంగా పిలిచేవారు. అంత గొప్ప చరిత్ర జనగాంకు ఉంది. జనగాంను జైన్ సర్క్యూట్‌గా తీర్చి దిద్దినట్లైతే పెద్ద ఎత్తున పర్యాటకులు వచ్చి సందర్శించే అవకాశం ఉంది. వరంగల్‌కు ఇప్పటికే హెరిటేజ్ అవార్డు ఇవ్వడం జరిగింది. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా బతుకమ్మ పండుగను హైదరాబాదు నగరంలో నిర్వహించి 35 దేశాల ప్రతినిధులు వచ్చే విధంగా ఆకర్షించడం జరిగింది. నా విజ్ఞప్తి ఏమంటే బతుకమ్మ పండుగ ప్రతి సంవత్సరం హైదరాబాదులో జరిగే విధంగానే గొప్ప చరిత్ర కలిగిన వరంగల్‌లో కూడా వచ్చే సంవత్సరం నుండి బతుకమ్మ పండుగను నిర్వహించినట్లైతే ప్రపంచ వ్యాప్తంగా పర్యాటకులు వచ్చే అవకాశం ఉందని గౌరవ మంత్రి గారికి విజ్ఞప్తి చేస్తున్నాను.

**శ్రీ రాథోడ్ బాపు రావు:–** అధ్యక్షా, ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ రాష్ట్రంలో ఉన్న పర్యాటక ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోలేదు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తరువాత పర్యాటక ప్రాంతాలను గుర్తించి వాటిని అభివృద్ధి చేసే కార్యక్రమం చేపట్టారు. తెలంగాణ కశ్మీర్‌గా పేరు పొందిన అదిలాబాద్ జిల్లాలోని బోథ్ నియోజకవర్గంలో అనేక జలపాతాలు ఉన్నాయి. అందులో కుంటాల, పొచెర, గాయత్రి, కన్‌కయ్, కోర్టికల్, ఘన్‌పూర్, సప్త కుండ్ వంటి సప్త జలపాతాలు ఉన్నాయి. ఇప్పటి వరకు అక్కడ ఎటువంటి అభివృద్ధి జరగలేదు. బోథ్ నియోజకవర్గంలో ఉన్న సప్త జలపాతాలను ఈ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి చేయాలని, రాష్ట్రంలో భారీ ఎత్తున పర్యాటక రంగాన్ని ప్రోత్సహించి అభివృద్ధి పరచాలని యోచిస్తున్న విషయం వాస్తవమేనా? అని గౌరవ ముఖ్యమంత్రివర్యులను, పర్యాటక శాఖామాత్యులను కోరుతున్నాను.

11.20 ఉ. **శ్రీమతి జెట్టి గీతా:–** అధ్యక్షా, సమైక్యాంధ్ర రాష్ట్రం వున్నప్పుడు పర్యాటక శాఖని అభివృద్ధి చేయలేదనే మాటను నేను తప్పు పడుతున్నాను. అసలు విషయాలను తెలుసుకోకుండా, శాసనసభను మిస్‌లీడ్ చేయడం పొరపాటు. గతంలో నేను పర్యాటక శాఖ మంత్రిగా పనిచేశాను. ఈ శాఖను నా తరువాత ఇద్దరు, ముగ్గురు మంత్రులుగా వుండి నిర్వహించారు. మీరు మాట్లాడుతున్న అవార్డుల్ని మేము ఆ రోజుల్లోనే తెచ్చుకున్నాము, కావాలంటే రికార్డులను చూసుకోండి. Maximum awards in the country మేము తెచ్చుకున్న వాళ్లమని తెలియజేస్తున్నాను. అవార్డుల విషయంలో కేరళ రాష్ట్రం తరువాత ఉన్న రాష్ట్రం మన రాష్ట్రమే. గతంలో ఉమ్మడి రాష్ట్రమైనప్పటికీ తెలంగాణలో కూడా అభివృద్ధి జరిగింది. మేము ఎన్నో కార్యక్రమాలను

చేపట్టాము. వేసైడ్ ఎమినిటీస్‌లో భాగంగా, హరితహారం క్రింద హరిత రెస్టారెంట్లను ఎక్కడ ఎక్కడ ఏర్పాటు చేశామో, మీరు లెక్క పెట్టుకోండని తెలియజేస్తున్నాను. ఉమ్మడి రాష్ట్రం కనుక రెండువైపులా చేశాము. ప్రస్తుతం మీకు ఒక రాష్ట్రం కనుక దీనిపైనే దృష్టిని పెట్టగలుగుతున్నారు. మీ ప్రభుత్వం వచ్చిన తరువాత వేసైడ్ ఎమినిటీస్‌ను కట్టించారా? ఏమైనా కాటేజెస్ కట్టించారా? ఎన్నోసార్లు ఎన్నో కార్యక్రమాలను మేము తీసుకువచ్చాము. పర్యాటక శాఖ తరపు నుంచి ఇతర రాష్ట్రాల నుంచి మనుషుల్ని ఇక్కడికి పిలిపించి, మన రాష్ట్రంలోని మనుషుల్ని అక్కడకు పంపేవారము. ఫారిన్ టూరిస్ట్‌లు ఎంతమంది వచ్చేవారో, ఇప్పుడు ఎంతమంది వస్తున్నారో? గమనించుకోండి. డొమెస్టిక్ టూరిజమ్‌పై ఎంత వున్నదనే విషయాలను చెబితే బాగుంటుంది. మేము ఈ శాఖను అభివృద్ధి పరచలేదంటే ఎలా? పర్యాటక భవన్‌ను ఎవరు కట్టించారు, అది మా పీరియడ్‌లో వచ్చింది, మీ పీరియడ్‌లో కట్టారా? అదేవిధంగా తారామతి బారామతి, హుస్సేన్ సాగర్‌లో బోటింగ్ ఎవరు ఏర్పాటు చేశారనే విషయాలను తెలియజేయాలని మంత్రి గారిని మీ ద్వారా కోరుతున్నాను.

**శ్రీ ఈటల రాజేందర్ః–** అధ్యక్షా, గతంలో పర్యాటక శాఖను నిర్వహించిన పెద్దలు గీతారెడ్డి గారు అభివృద్ధి కోసం పాటు పడలేదని చెప్పడం లేదు. గతంలో స్వదేశీ పర్యాటకులు, విదేశీ పర్యాటకులు ఎంత మంది వచ్చేవారని అడిగారు. గతంలో స్వదేశీ పర్యాటకులు 2013–14లో 5కోట్ల,84లక్షల మంది, 2016–17లో 9కోట్ల,60లక్షల మంది వచ్చారు. గతంలో విదేశీ పర్యాటకులు 2014–15లో 75వేలు మంది, 2016లో ఒకకోటి, 66లక్షల మంది, 2017లో 2.50లక్షల మంది వచ్చారని తెలియజేస్తున్నాను.

గౌరవసభ్యులు వినయ్ భాస్కర్‌గారు చెప్పినట్లుగా, తెలంగాణ ప్రాంతం అనేక గొప్ప గొప్ప దేవాలయలకు, ప్రాచీన కట్టడాలకు, సాంప్రదాయాలకు, సంస్కృతికి, మానవ సంబంధాలకు నిలయమని తెలియజేస్తున్నాను. అన్నింటికంటే మిక్కిలిగా ప్రకృతిని పూజించే పండుగలను జరుపుకునే రాష్ట్రం ఈ రాష్ట్రమే. అతిథిదేవోభవ అనే నానుడిని గొప్పగా ఆచరించేటటువంటి రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం అని తెలియజేస్తున్నాను.

(ట్రెజరీ బెంచీల నుంచి హర్షధ్వానాలు)

గౌరవ ముఖ్యమంత్రి గారు ఈ రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధి జరిగితే, ఉద్యోగాల కల్పన మాత్రమే కాకుండా, సింగపూర్, ఈజిప్ట్, దుబాయ్ లాంటి అనేక దేశాల్లో పర్యాటక రంగంపై ఆర్థిక పరిపుష్టి గొప్పగా వస్తున్నందున, దీనిపై దృష్టి పెట్టాలన్న ఉద్దేశంతో, ప్రత్యేక ఫోకస్ పెట్టి అనేక విషయాల్లో నిధులు కేటాయిస్తున్న విషయం వాస్తవమని తెలియజేస్తున్నాను. స్వదేశీ దర్శన్ స్కీమ్ క్రింద మూడు ప్రాజెక్టుల్ని ఈ రాష్ట్రం దక్కించుకుంది. Integrated development of eco-tourism circuit in Mahaboobnagar District క్రింద సోమశిల, మహానంది, మల్లెలతీర్థం, ఉమామహేశ్వరం, ఫరహాబాద్, కావలి, కదలివనం లాంటి ప్రదేశాలను రూ.141కోట్లతో అభివృద్ధి చేస్తున్నాము. Tribal security క్రింద ములుగు, మేడారం, తాడివాయి, దామరవాయి, మల్లూరు లాంటి ప్రాంతాలను కూడా కోట్ల రూపాయల నిధులు ఖర్చు పెట్టి అభివృద్ధి పరుస్తున్నాము. Integrated development in entire Hyderabad క్రింద కుతుబుషాహిటూంబ్స్, రేమండ్స్, మక్కామసీదుతోపాటు, పురాతనమైన కట్టడాలను కూడా అభివృద్ధి చేసుకుంటున్నాము.

తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత, తెలంగాణ ప్రజలు జరుపుకునే బతుకమ్మ పండుగను, అన్ని దేశాల్లో జరుపుకునే విధంగానే కాకుండా, విదేశస్థులు కూడా తెలంగాణ ప్రాంతానికి వచ్చి పండుగలో పాల్గొనే విధంగా ఆలోచిస్తున్న సందర్భాలు ఉన్నాయి. గతంలో ఏనాడు కూడా వీటి అభివృద్ధి కోసం ప్రభుత్వ ట్రెజరీ నుంచి డబ్బులు ఖర్చు పెట్టిన పాపాన పోలేదు. దేశ వ్యాప్తంగా తిరుపతిని సందర్శించడానికి భక్తులు ఏ విధంగా వస్తారో, అటువంటి పద్ధతిలో గొప్ప నిర్మాణాలు చేయడానికి ఈ రోజు వందల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయి. రాబోయే ఒక సంవత్సర కాలం లోపు, ఈ రాష్ట్రంలో వున్న దేవాలయాలను అంటే, యాదగిరిగుట్ట గుడి కానీ, వేములవాడ గుడి కానీ, కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయం కానీ, జోగులాంబ దేవాలయం, కాళేశ్వరం దేవాలయాలను గొప్పగా అభివృద్ధి పరచుకునే ఆస్కారం ఉంది. ఈ రాష్ట్రంలోని ప్రాజెక్టులు మేడిగడ్డ నుంచి శ్రీరామ్‌సాగర్ కానీ, మిడ్‌మానేరు పూర్తైతే, ప్రాజెక్టుల్లో నీళ్లు కదలాడుతాయి. అడవులు, నదులు కలిగి వున్న ప్రాంతం, కనుక పర్యాటక అభివృద్ధికి అవకాశం ఉన్న రాష్ట్రం. ముఖ్యమంత్రి గారి ఆదేశాల మేరకు, ఆ శాఖను అభివృద్ధి చేస్తున్నందున, దేశంలోనే పర్యాటక రంగంలో ఈ రాష్ట్రాన్ని మొదటి రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నాలు చేస్తామని సభ్యులకు విన్నవిస్తున్నాను.

**శ్రీ మల్లు భట్టి విక్రమార్క (మధిర)ః–** అధ్యక్షా, పర్యాటక శాఖ గురించి మంత్రి గారు సుదీర్ఘంగా చెప్పారు. ఉమ్మడి రాష్ట్రం వున్నప్పుడే, ఈ రాష్ట్రానికి టూరిజమ్ క్రింద, కేంద్ర ప్రభుత్వం నుంచి అనేక ప్రాజెక్టులు వచ్చాయి. ఇంతవరకు ఆ ప్రాజెక్టులు పూర్తి చేయకుండా, మీరు వాటిని పూర్తి చేసి, వాటికి సంబంధించిన సమాచారం పంపించి వుంటే, ఈ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం నుంచి ఇంకా పెద్ద ఎత్తున నిధులు వచ్చేవి. మీరు చెబుతున్న ఏ ప్రాజెక్టు కూడా ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత, ప్రాజెక్టులు వచ్చినవేమి లేవు. మీరు గతంలో ట్యాంక్ బండ్‌లో డాల్ఫిన్‌లు ఎగురుతాయని చెప్పారు.

11.30 ఉ. ఇంతవరకు ట్యాంక్‌బండ్‌ను మంచినీటి సరస్సుగా మార్చలేదు. అందులో డాల్ఫిన్లు ఎగరలేదు. అలాగే మిగతా ప్రాజెక్ట్స్ విషయం గురించి నేను మంత్రిగారిని నేరుగా అడుగుతున్నాను, ఉమ్మడి రాష్ట్రం ఉన్నప్పుడు తెలంగాణ ప్రాంతానికి సంబంధించి, ఆనాడు ఆ రాష్ట్ర ప్రభుత్వం మొదలుపెట్టిన ప్రాజెక్టులన్నీ పూర్తి చేశారా లేదా? కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులతో మొదలుపెట్టిన ప్రాజెక్టులన్నింటిని పూర్తి చేశారా లేదా? చేయకపోతే ఎందుకు చేయలేకపోతున్నారో చెప్పండి.

**శ్రీ ఈటల రాజేందర్:–** అధ్యక్షా, వారి హయాంలో తెచ్చిన ప్రాజెక్టులు మాత్రమే కాకుండా, అప్పుడు కేటాయించిన నిధులు మాత్రమే కాక, ఇప్పటిదాక నేను చెప్పినట్లుగా బుద్ధవనం మీరు చేయలేదు. బుద్ధ వనం మీద ఈ రోజు స్పెషల్ ఫోకస్ పెట్టి దానికి ఒక ఛైర్మన్‌ను ఏర్పాటు చేసి, గొప్పగా అభివృద్ధి చేస్తున్నాము. ఆ విషయాన్ని మీరు గుర్తు పెట్టుకోవాలి. ఈ రాష్ట్రం డబ్బులు ఖర్చుపెట్టే రాష్ట్రమా కాదా అనడానికి ఒకసారి యాదగిరి గుట్టకు వేములవాడకు వెళ్లి చూసిరండి. ఒక్కసారి కరీంనగర్‌కు వెళ్లి చూడండి. మీరు మాటిమాటికి మేము ఏమి చేయడం లేదు. మా హయాంలో మాత్రమే అభివృద్ధి జరిగింది అంటున్నారు. మీ హయాంలో జరిగిన దాని కంటే వందల రెట్ల వేగంతో తెలంగాణ ప్రభుత్వం అనేక రకాల స్కీమ్‌లను రూపకల్పన చేసింది. మీరు దాన్ని మరచిపోతున్నారు.

MR.SPEAKER:- Question Hour is over. Remaining questions are postponed. Now Adjournment Motions….

## సభా కార్యక్రమము

## వాయిదా తీర్మానాల అనుమతి గురించి

1. శ్రీ జి. కిషన్‌రెడ్డి గారు ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఇచ్చిన వాయిదా ప్రతిపాదన తిరస్కరించడమైనది.

2. శ్రీ సండ్ర వెంకట వీరయ్యగారు మరియు ఇతర సభ్యులు 1998 డిఎస్సీ, ద్వారా ఎంపికైన అభ్యర్థులకు పోస్టింగ్‌లు ఇవ్వాలని కోరుతూ ఇచ్చిన వాయిదా ప్రతిపాదన తిరస్కరించడమైనది.

3. శ్రీ సున్నం రాజయ్య గారు, విద్య, వైద్య రంగాల్లో ఫీజులతో కార్పోరేట్ దోపిడిని అరికట్టాలని ఖాళీ పోస్టులు భర్తీ చేసి సౌకర్యాలను మెరుగుపరచాలని కోరుతూ ఇచ్చిన వాయిదా ప్రతిపాదన తిరస్కరించడమైనది.

The House is adjourned to meet again at 10.00 A.M., tomorrow i.e., 3rd November, 2017.

(The House then adjourned at 11.32 A.M., to meet again at 10.00 A.M., on Friday, the 3rd day of November, 2017)

* * * * *

**"Published under Rule 347 of the Rules of Procedure and Conduct of Business in the Telangana Legislative Assembly and Printed at Assembly Press, Public Gardens, Hyderabad."**